

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 13 సంచిక : 84 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 26 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :84 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM THU 26 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

ఏఐ అదుపు తప్పితే.. ఆపడం ఎవరి వల్లా కాదు!



- కిల్ స్విచ్ కూడా సరిపోదన్న ఓపెన్ఏఐ మాజీ డైరెక్టర్..
- చెర్నోబిల్ తరహా విపత్తుపై మరో నిపుణుడి హెచ్చరిక
- విదేశీ కంప్యూటింగ్ వ్యవస్థల్లో ఏఐలపై నియంత్రణ అసాధ్యమని ఆందోళన
- అమెరికా, చైనా కలిసి పనిచేయకపోతే పెను ప్రమాదమని వెల్లడి
- ఏఐతో 'చెర్నోబిల్' తరహా మహా విపత్తు పొంచి ఉందన్న హింటన్
- ఆర్థిక, పవర్ గ్రిడ్ వ్యవస్థలను ఏఐ స్తంభింపజేసే ప్రమాదం

- మిగతా 2లో

పుట్టిన ప్రదేశంపై స్పష్టత ఇవ్వండి.. సౌరవ్‌దాస్‌కు కేంద్రం నోటీసులు



పెన్ పవర్ డెస్క్: కాక్రోచ్ జనతా పార్టీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్‌కు సంబంధించి తన పాస్‌పోర్టులో పేర్కొన్న పుట్టిన ప్రదేశం వివరాలపై వ్యత్యాసాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ విషయంపై భద్రతా సంస్థల నుంచి నివేదికలు అందాయని.. ఈ నేపథ్యంలోనే ఆయనకు చెన్నైలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు విదేశాంగ

- మిగతా 2లో

సీఐఏనే హ్యాక్ చేసిన చైనా ఆయుధం!

అమెరికా నిఘా కోటలో కలకలం..

- ఆర్టెక్స్ ఏఐ టూల్‌తో సైబర్ దాడి జరిగినట్లు అనుమానాలు..
- బహిరంగ సమాచారాన్ని తస్కరించిన హ్యాకర్లు



- మిగతా 2లో



- ఏపీ వ్యాప్తంగా తొలి విడత స్థానిక ఎన్నికల పోలింగ్
- గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్
- పంచాయతీ ఎన్నికల ఫలితాలు నేడు సాయంత్రానికే వెల్లడి
- నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీల్లోనూ నేడు ఎన్నికలు
- పట్టణ స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపు నవంబర్ 30న నిర్వహణ

ఆంధ్రప్రదేశ్‌లో (గురువారం, నవంబర్ 26) ఎన్నికల సందడి నెలకొననుంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా ఓటు పండుగ వాతావరణం కనిపించనుంది. పంచాయతీ ఎన్నికల తొలి విడత పోలింగ్ కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. 26 జిల్లాల పరిధిలోని 201 మండలాల్లో పంచాయతీ ఎన్నికలతో పాటు, గతంలో వివిధ కారణాలతో వాయిదా పడిన 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలకు రేపు ఉదయం నుంచే పోలింగ్ ప్రారంభం కానుంది.

- మిగతా 2లో

ఏపీ సొంత రాబడి పెరిగింది..

ఆదాయార్జన శాఖలపై చంద్రబాబు కీలక సమీక్ష



- రాష్ట్ర సొంత ఆదాయంలో 18.7 శాతం వృద్ధి నమోదు
- ప్రజలపై భారం లేకుండా ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు
- నవంబర్ 23 నాటికే 58 శాతం వార్షిక లక్ష్యం పూర్తి
- వాణిజ్య, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల్లో పెరిగిన రాబడి
- పన్నుల పరిశీలన, ఆడిట్‌లలో ఏఐ సాంకేతికత వినియోగం

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ఆదాయార్జన శాఖల పనితీరు, రాబడి వృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, పరిపాలనా సంస్కరణలు, క్షేత్రస్థాయి అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఈ సందర్భంగా వెల్లడైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్పెషల్ మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయానికి నమోదైన రూ.62,604 కోట్లతో పోలిస్తే ఇది రూ.11,738 కోట్లు అధికమని, మొత్తంగా 18.7 శాతం వృద్ధి నమోదైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

- మిగతా 2లో

డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు..

పెట్టుబడుల రక్షణ చట్టంపై బిల్లు పెట్టే అవకాశం



- ఏపీ శాసనసభ శీతాకాల సమావేశాలకు డేట్ ఫిక్స్
- పెట్టుబడుల రక్షణ చట్టం' బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం
- రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా పరిశ్రమలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఇటీవల సీఐఐ సదస్సులో భారీ పెట్టుబడుల ఒప్పందాల నేపథ్యంలో కీలక అడుగు

- మిగతా 2లో

సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతు.. కాకినాడ జిల్లా కలెక్టర్ కీలక ప్రకటన..



పెన్ పవర్ డెస్క్:కాకినాడ జిల్లా ఉప్పాడ మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 19న సముద్రంలో గల్లంతయ్యారని ప్రకటించారు కాకినాడ కలెక్టర్ హరేంధిర ప్రసాద్. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై కోస్ట్‌గార్డ్ అధికారులకు తెలియజేసిందని అన్నారు.గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 18వ తేదీన ఒడిశాలోని పారాదీప్ పోర్టు

- మిగతా 2లో

నాకు క్యాన్సర్ ఉందని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారు

- త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమన్న కవిత
- టీఆర్ఎస్ పార్టీ ఆదరణ చూసి ఓర్వలేకే తనపై దాడులు చేస్తున్నారని వ్యాఖ్య
- ఇప్పటికే తనను ఇంట్లో నుంచి వెళ్లగొట్టారని ఆవేదన

- మిగతా 2లో





భారత్‌పై ట్రంప్ టారిఫ్ పిడుగు..

25 శాతం వరకు సుంకాల ముప్పు!

- వాణిజ్య ఒప్పందం కుదిరితే 17 శాతానికి తగ్గే అవకాశం..
- భారత్ సహా 14 దేశాలపై అమెరికా ప్రతిపాదన
- అధిక పారిశ్రామిక ఉత్పత్తి అమెరికా మార్కెట్‌ను దెబ్బతీస్తోందన్న వాషింగ్టన్
- ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం జనవరి నుంచి అమల్లోకి వచ్చే ఛాన్స్

- మిగతా 2లో

నారా లోకేశ్ నాయకత్వంలో సరికొత్త చరిత్ర..

10 లక్షల మందితో 'మైటీడీపీ' అతిపెద్ద మైలురాయి

- మైటీడీపీ యాప్‌లో నమోదైన కార్యకర్తల సంఖ్య పది లక్షలకు చేరిక
- పార్టీతో కార్యకర్తలను నేరుగా అనుసంధానించేందుకు సరికొత్త సాంకేతికత
- క్షేత్రస్థాయిలో కష్టపడే శ్రేణులకు గుర్తింపునిచ్చేలా నారా లోకేశ్ సూచనలతో ప్రత్యేక వ్యవస్థ
- అభిప్రాయ సేకరణతో పాటు పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణకు డిజిటల్ వేదిక
- నరసరావుపేట, కుప్పం సహా పలు నియోజకవర్గాల్లో యాప్ వినియోగం ముందంజ



- మిగతా 2లో



జగన్ సీఎం పదవి అడిగారు..

సోనియా నో చెప్పారు!

- జగన్ కాంగ్రెస్‌ను వీడటంపై విజయసాయిరెడ్డి వ్యాఖ్యలు.. '
- వెన్నుపోటుదారుడు ఎవరు?' అంటూ ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్‌పీ) అధ్యక్షుడు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై సంచలన ఆరోపణలు చేశారు. జగన్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఈ మేరకు రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ

- మిగతా 2లో



భారత్‌పై ట్రంప్ టారిఫ్ పిడుగు..

భారతదేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై 17 శాతం అదనపు సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో నెలకొన్న మితిమీరిన తయారీ సామర్థ్యం, అవసరానికి మించిన ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో అమెరికా కొత్త వాణిజ్య విధానాన్ని (ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్) ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్‌తో సహా మొత్తం 14 దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ సరికొత్త పన్నుల విధానాన్ని రూపొందించింది.అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) కార్యాలయం విడుదల చేసిన ప్రాథమిక జాబితా ప్రకారం, భారత ఎగుమతులపై గరిష్ఠంగా 25 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉంది. అయితే, ట్రంప్ ప్రభుత్వంతో న్యూఢిల్లీ సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే ఈ రేటును 17 శాతానికి తగ్గిస్తామని స్పష్టం చేసింది. ఈ కొత్త వాణిజ్య చర్యల పరిధిలోకి భారత్‌తో పాటు చైనా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలను చేర్చారు. మార్కెట్ వాస్తవ డిమాండ్‌కు మించి ఇతర దేశాల ప్రభుత్వాలు తమ పరిశ్రమల్లో అధిక సామర్థ్యాన్ని, మితిమీరిన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయా అనే అంశంపై యూఎస్‌టీఆర్ గత మార్చి నెలలో దర్యాప్తు ప్రారంభించింది. కొన్ని దేశాలు అవసరానికి మించి వస్తువులను ఉత్పత్తి చేసి గ్లోబల్ మార్కెట్లలో దంపింగ్ చేస్తుండటం వల్ల ధరలు భారీగా పడిపోతున్నాయని అమెరికా వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా, అమెరికాలోని స్థానిక తయారీ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, స్వదేశీ కంపెనీలు పోటీ పడటం కష్టతరంగా మారుతోందని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. ఈ విచారణ పరిధిలో బ్యాటరీలు, సిమెంట్, రసాయనాలు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి విస్తృత రంగాలు ఉన్నాయి.అయితే, ఈ ప్రతిపాదిత సుంకాలు తక్షణమే అమల్లోకి రావడం లేదు. తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు వ్యాపార వర్గాలు, పరిశ్రమల భాగస్వాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు యూఎస్ యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, పరిస్థితులు అనుకూలిస్తే వచ్చే ఏడాది జనవరి నాటికి ఈ సుంకాలు అమల్లోకి రావచ్చని అమెరికా సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.గతంలో ట్రంప్ ప్రభుత్వం విధించిన గ్లోబల్ టారిఫ్‌లను చెల్లవంటూ, అధ్యక్షుడికి ఆ విధమైన చట్టబద్ధమైన అధికారం లేదని పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసిన కొన్ని నెలలకే ఈ తాజా పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికాలో ఆటోమొబైల్స్, స్టీల్ వంటి నిర్దిష్ట రంగాలపై మాత్రమే ప్రత్యేక సుంకాలు కొనసాగుతున్నాయి.

సముద్రంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతు..
కాకినాడ జిల్లా కలెక్టర్ కీలక ప్రకటన..

- మొదటి పేజీ తరువాయి

సమీపంలో కనిపించినట్లు ప్రాథమికంగా గుర్తించారని... ఆ తరువాత వారు ఫోన్ ద్వారా గానీ, ట్రాన్స్‌పాండర్ ద్వారా గానీ ఎలాంటి సమాచారం అందుబాటులోకి రాలేదని తెలిపారు. మత్స్యకారులు గల్లంతైనట్లు సమాచారం అందిన వెంటనే కాకినాడ కోస్ట్‌గార్డ్ అధికారులు తక్షణమే స్పందించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారని తెలిపారు.

కోస్ట్ గార్డ్, నేవీ అధికారుల సంయుక్త గాలింపు:

గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కనుగొనేందుకు కోస్ట్‌గార్డ్, నేవీ అధికారులు సంయుక్తంగా విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. యుద్ధ నౌకలు, హెలికాప్టర్లతో సముద్రం లో నిరంతరాయంగా గాలింపు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారాన్ని బంగ్లాదేశ్, మయన్మార్ నేవీ అధికారులతో కూడా పంచుకున్నట్లు తెలిపారు.గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా తిరిగి వస్తారని... వారి ఆచూకీ లభించే వరకు సంబంధిత అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలను కొనసాగించనున్నట్లు తెలిపారు కలెక్టర్.

ఏఐ అదుపు తప్పితే..
ఆపడం ఎవరి వల్లా కాదు!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పెను విధ్వంసకర శక్తుల చేతుల్లోకి వెళ్లినా లేదా నియంత్రణ కోల్పోయినా దాన్ని ఆపడానికి ఎలాంటి 'కిల్ స్విచ్' (ఎమర్జెన్సీ షట్‌డౌన్) పనిచేయదని ఓపెన్‌ఏఐ మాజీ బోర్డు సభ్యురాలు హెలెన్ టోనర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జార్జ్‌టౌన్ వర్సిటీకి చెందిన భద్రతా నిపుణురాలైన ఆమె ఏఐ ముప్పు తీవ్రతను వివరించారు.ఒక్క కిల్ స్విచ్‌తో అన్ని సమస్యలనూ పరిష్కరించడం అసాధ్యమని టోనర్ స్పష్టం చేశారు. కొన్ని రకాల అత్యవసర పరిస్థితుల్లో వేర్వేరు స్థాయుల్లో షట్‌డౌన్ లేదా ఓవర్‌రైడ్ వ్యవస్థలు ఉపయోగపడతాయేమో కానీ, ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన వ్యవస్థలను పూర్తిగా ఆపలేవని తెలిపారు. అమెరికా పరిధికి ఆవల, పూర్తి స్వయంప్రతిపత్తితో నడిచే కంప్యూటింగ్ వ్యవస్థలపై పనిచేసే ఏఐలను నియంత్రించడం ఎవరి వల్లా కాదని పేర్కొన్నారు. చైనా పోటీని బూచిగా చూపిస్తూ అత్యంత ప్రమాదకరమైన ఏఐ టెక్నాలజీని గుడ్డిగా అభివృద్ధి చేసుకుంటూ పోవడం ఆత్మహత్యాసదృశ్యమని అభిప్రాయపడ్డారు.మరోవైపు 'ఏఐ గాడ్‌ఫాదర్'గా పేరొందిన జెఫ్రీ హింటన్ సైతం ఏఐ ముప్పుపై తీవ్ర హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో విద్యుత్ లేదా ఆర్థిక వ్యవస్థలను స్తంభింపజేసేలా ఏఐ వల్ల 'చెర్నోబిల్' తరహా పెను విపత్తు సంభవించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఏడాది లేదా రెండేళ్లలోనే ఇలాంటి దుర్ఘటన జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి తీవ్రమైన రిస్కులు ఉంటాయని తెలిసినప్పటికీ ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, శామ్ ఆల్ట్‌మన్ వంటి దిగ్గజాలు లాభాల కోసం పోటీపడుతున్నారని హింటన్ విమర్శించారు. ఏఐ చాట్‌బాట్లు సొంత భాషను అభివృద్ధి చేసుకుంటే నియంత్రణ పూర్తిగా చేజారిపోతుందని తేల్చిచెప్పారు.

నాకు క్యాన్సర్ ఉందని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారు

త్వరలోనే బీఆర్ఎస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఒక మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, బీఆర్ఎస్ నాయకత్వంపై పలు తీవ్ర ఆరోపణలు చేశారు.తమ పార్టీ టీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందనే భయంతోనే బీఆర్ఎస్ నేతలు తనపై వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తనను ఇలా వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వల్ల వారికి ఏం వస్తుందని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే తనను ఇంటి నుంచి వెళ్లగొట్టారని, ఇంకా ఏం సాధిస్తారని అన్నారు.గతంలోనూ తన ఆరోగ్యంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయించారని, తనకు క్యాన్సర్ ఉందని, త్వరలోనే చనిపోతానంటూ ప్రచారం చేశారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తన నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం గతంలో కేసీఆర్ వద్దకు వెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఇరు వర్గాల మధ్య రాజకీయ విభేదాలు మరింతగా తీవ్రరూపం దాల్చాయి.

మరోవైపు, నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించడాన్ని అందరూ ఐక్యంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

ఏపీలో రేపు ఓటు పండుగ.. పల్లెలు, పట్టణాల్లో పోలింగ్ సందడి!

పల్లెల్లో పోలింగ్, లెక్కింపు నేడే..

గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ సందడి ఉదయం 7 గంటలకే మొదలుకానుంది. తొలి విడతలో మొత్తం 3,949 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా, అందులో 758 స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 3,191 సర్పంచ్ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుండగా, బరిలో 9,052 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తిరుపతి జిల్లాలో అత్యధికంగా 269 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా, అన్నమయ్య జిల్లాలో అత్యధిక స్థానాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు వెల్లడించారు.అలాగే 39,832 వార్డు సభ్యుల స్థానాలకు గాను 14,727 స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 25,061 స్థానాల్లో 53,678 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. పంచాయతీ పోలింగ్ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, రేపు సాయంత్రానికే ఫలితాలు వెల్లడించనున్నారు. ఫలితాల ప్రకటన ముగిసిన వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికను కూడా అక్కడికక్కడే నిర్వహిస్తారు. ఎక్కడైనా అనివార్య కారణాల వల్ల రీపోల్ అవసరమైతే నవంబర్ 27న నిర్వహిస్తారు.

నగరాలు, పురపాలికల్లోనూ ఓటింగ్

గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ రేపు ఎన్నికల వేడి కనిపించనుంది. శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్లలో రేపు పోలింగ్ జరగనుంది. ఈ నాలుగు కార్పొరేషన్ల పరిధిలోని 260 వార్డుల్లో ఇప్పటికే రాజమహేంద్రవరంలో 2 వార్డులు ఏకగ్రీవం కాగా, మిగిలిన 258 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తున్నారు.

వీటితో పాటు ఆమదాలవలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నరసరావుపేట, బాపట్ల, కందుకూరు, పొదిలి, కావలి, గూడూరు (నెల్లూరు), అల్లూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట వంటి 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. పట్టణ సంస్థల్లోని 750 వార్డుల్లో 39 ఏకగ్రీవం కాగా, మిగిలిన 711 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,801 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇక్కడ సుమారు 24.98 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగుతుంది. అయితే ఈ పట్టణ సంస్థల ఓట్ల లెక్కింపును మాత్రం నవంబర్ 30న చేపట్టనున్నారు.

పటిష్ఠ బందోబస్తు.. స్థానిక సెలవు

ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం స్థానిక సెలవు ప్రకటించింది. పంచాయతీ ఎన్నికలు మొత్తం మూడు విడతల్లో జరుగుతుండగా, రెండో విడత నవంబర్ 29న, మూడో విడత డిసెంబర్ 2న నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది.

డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'పెట్టుబడుల రక్షణ చట్టం' (ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్) బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సమావేశాలు దాదాపు 15 రోజుల పాటు కొనసాగవచ్చని తెలుస్తోంది.రాష్ట్రానికి వచ్చే పారిశ్రామిక పెట్టుబడులకు రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా చట్టపరమైన భరోసా కల్పించడమే ఈ నూతన చట్టం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో అధికారం మారినప్పుడు... పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలు, భూ కేటాయింపుల విషయంలో భవిష్యత్తులో విధానపరమైన ఆకస్మిక మార్పులు జరగకుండా నిరోధించేందుకు ఈ బిల్లును రూపొందిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు.

ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రికార్డు స్థాయిలో దాదాపు రూ. 9.89 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో పారిశ్రామికవేత్తల్లో మరింత నమ్మకాన్ని పెంచేందుకు ఈ చట్టాన్ని వేగంగా తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "చాలా మంది పెట్టుబడిదారులు దీనిపై మమ్మల్ని అడిగారు. ప్రభుత్వం దీనిపై తీవ్రంగా ఆలోచిస్తోంది, కచ్చితంగా చట్టం తెస్తాం" అని పేర్కొన్నారు.మరోవైపు రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రంగా చర్చించనున్నారు.

ఏపీ సొంత రాబడి పెరిగింది..

- మొదటి పేజీ తరువాయి

ఈ సమీక్షా సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ (సాయి ప్రసాద్)తో పాటు ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర వార్షిక ఆదాయ లక్ష్యం రూ.1,27,506 కోట్లు కాగా, నవంబర్ 23 నాటికే అందులో 58 శాతం మేర సాధించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో 18.8 శాతం, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి నమోదైంది. పన్ను ఆదాయం గతేడాది రూ.53,692 కోట్లు ఉండగా, ఈ ఏడాది రూ.10,104 కోట్లు పెరిగి రూ.63,796 కోట్లకు చేరింది. అలాగే పన్నేతర ఆదాయం రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు ఎగబాకింది.

శాఖల వారీగా ఆదాయ వివరాలు:

వాణిజ్య పన్నులు: 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్ల మేర అదనపు ఆదాయం నమోదైంది. ఇందులో జీఎస్టీ ద్వారా వచ్చిన రాబడి 18.1 శాతం పెరిగి రూ.3,694 కోట్లకు చేరింది.

ఎక్సైజ్ శాఖ: స్పెషల్ మార్జిన్‌తో కలిపి రూ.20,083 కోట్ల ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే 19.6 శాతం వృద్ధితో రూ.3,287 కోట్లు అదనంగా సమకూరింది.

స్టాంపులు, రిజిస్ట్రేషన్లు: 16.6 శాతం వృద్ధితో మొత్తం రూ.8,020 కోట్ల రాబడి వచ్చింది.

రవాణా శాఖ: వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ల ద్వారా 17.3 శాతం వృద్ధి నమోదై రూ.3,649 కోట్ల పన్నుల ఆదాయం సమకూరింది.

గనులు, భూగర్భ శాఖ: 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు చేరింది.

అటవీ శాఖ: 22.3 శాతం పెరిగి రూ.22 కోట్ల ఆదాయం లభించింది.

స్థానిక సంస్థలు: ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీల పన్ను ఆదాయం రూ.238 కోట్లుగా, పట్టణ స్థానిక సంస్థల్లో రూ.2,365 కోట్లుగా నమోదైంది.

ప్రజలపై భారం మోపొద్దు: సీఎం చంద్రబాబు

సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండానే ప్రభుత్వ శాఖల్లో రాబడిని మరింత పెంచేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థల్లో లీకేజీలను అరికట్టడం, లోపాలను సరిదిద్దడం, ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకతను పెంచడం వల్లే ఆదాయంలో గణనీయమైన పురోగతి కనిపించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం స్పష్టంగా ప్రతిబింబించేలా ఆదాయ వృద్ధి కొనసాగాలని అధికారులను ఆదేశించారు.

పన్ను వసూళ్ల వ్యవస్థను ఆధునీకరించే క్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, వాణిజ్య పన్నుల శాఖలోని నాలుగు విభాగాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఏఐ స్టాక్ వినియోగిస్తున్నామని.. పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, క్షేత్రస్థాయి తనిఖీలు, న్యాయపరమైన వ్యవహారాల పరిష్కారంలో సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

నారా లోకేశ్ నాయకత్వంలో సరికొత్త చరిత్ర..

రాజకీయాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో భాగంగా తెలుగుదేశం పార్టీ మరో ముందడుగు వేసింది. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆలోచనతో, పార్టీ కార్యకర్తలను అధిష్ఠానంతో అనుసంధానించే లక్ష్యంతో రూపొందించిన 'మైటీడీపీ' (వీఐఐపీ) యాప్‌లో నమోదైన వారి సంఖ్య 10 లక్షల మైలురాయిని అధిగమించింది. ఈ మేరకు టీడీపీ ఒక అధికారిక ప్రకటనలో వెల్లడించింది. దేశంలోని ప్రాంతీయ పార్టీల డిజిటల్ నిర్వహణలో ఇది ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

నారా లోకేశ్ విజన్ కు అనుగుణంగా ఈ డిజిటల్ వేదికను అభివృద్ధి చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే సాధారణ కార్యకర్తలను గుర్తించి, వారి సేవలకు తగిన అవకాశాలు కల్పించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశమని పార్టీ తెలిపింది. గ్రామాల్లో, వార్డుల్లో పార్టీ కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారం, సేవా కార్యక్రమాలు నిర్వహించే కార్యకర్తలు తమ వివరాలను ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో నమోదు చేసుకునే వీలు కల్పించారు. దీని ద్వారా కార్యకర్తల పనితీరును నేరుగా పరిశీలించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు, పార్టీ పదవులు మరియు నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో ప్రాధాన్యం ఇస్తున్నట్లు పార్టీ స్పష్టం చేసింది.

ఈ యాప్ ద్వారా అధినేత సందేశాలు, పార్టీ మార్గదర్శకాలు త్వరితగతిన శ్రేణులకు చేరుతున్నాయి. అదే సమయంలో క్షేత్రస్థాయి సమస్యలు, కార్యకర్తల అభిప్రాయాలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇది ఉపయోగపడుతోంది. ఇటీవల నిర్వహించిన డిజిటల్ మహానాడుతో పాటు శిక్షణా తరగతులు, ఇతర సమావేశాల హాజరును కూడా ఈ వ్యవస్థ ద్వారానే పర్యవేక్షిస్తున్నారు. అంతేకాకుండా, పార్టీ నాయకులతో కార్యకర్తలు దిగిన ఫొటోలను సులభంగా పొందేందుకు వీలుగా 'ఫొటో బూత్' పేరిట ఫేస్ రికగ్నిషన్ సదుపాయాన్ని కూడా ఇందులో పొందుపరిచారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ యాప్ వినియోగంలో పార్లమెంట్ విభాగంలో నరసరావుపేట, చిత్తూరు, ఒంగోలు, నెల్లూరు, గుంటూరు నియోజకవర్గాలు ముందంజలో ఉండగా.. అసెంబ్లీ విభాగంలో కుప్పం, వినుకొండ, కనిగిరి, మంగళగిరి, గన్నవరం నియోజకవర్గాలు అగ్రస్థానంలో నిలిచాయని పార్టీ ప్రకటన వివరించింది. ఆధునిక కాలంలో రాజకీయ వ్యవస్థను సాంకేతికతతో జోడించి, కార్యకర్తలే కేంద్రంగా పార్టీ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ డిజిటల్ వేదిక ఒక కీలక సాధనంగా మారిందని తెలుగుదేశం పార్టీ పేర్కొంది.

జగన్ సీఎం పదవి అడిగారు..సోనియా నో చెప్పారు!

- మొదటి పేజీ తరువాయి

పలు అంశాలను ఆయన మీడియా ముందు వెల్లడించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం అనంతరం, ముఖ్యమంత్రి పీఠం కోసం జగన్ తీవ్రంగా డిమాండ్ చేశారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. అయితే జగన్ చేసిన ఆ అభ్యర్థనను అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ పూర్తిగా నిరాకరించారని తెలిపారు. ముఖ్యమంత్రి పదవి ఇవ్వడానికి కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించకపోవడంతోనే, జగన్ పార్టీతో పాటు ఎంపీ పదవికి కూడా రాజీనామా చేశారని విజయసాయిరెడ్డి వివరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అసలైన వెన్నుపోటుదారు ఎవరో వైసీపీ నేతలు ఇప్పటికైనా ఆలోచించి తెలుసుకోవాలని ఆయన సూచించారు.

గతంలో వైసీపీలో తన స్థానం గురించి మాట్లాడుతూ... పార్టీని క్షేత్రస్థాయిలో నిలబెట్టేందుకు తాను పడిన శ్రమ, చేసిన పోరాటాల ఫలితంగానే తనకు పార్టీలో నంబర్-2 స్థానం లభించిందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తన కష్టాన్ని గుర్తించి ఆ గుర్తింపు ఇచ్చారే తప్ప, ఎవరూ ఉచితంగా ఏమీ ఇవ్వలేదని ఆయన స్పష్టం చేశారు.మరోవైపు తన ప్రస్తుత పార్టీ విధివిధానాలపై విజయసాయిరెడ్డి వివరణ ఇచ్చారు. 1983లో తెలుగుదేశం పార్టీ అనుసరించిన ప్రజా విధానాలనే తమ పరివర్తన రాజనీతి పార్టీ కూడా అనుసరిస్తుందని ఆయన వెల్లడించారు. పీఆర్‌పీ ఎల్లప్పుడూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి మరియు సంక్షేమం కోసమే నిబద్ధతతో పాటుపడుతుందని ఆయన పేర్కొన్నారు.

సీఐఐనే హ్యాక్ చేసిన చైనా ఆయుధం!

తాడిని తన్నే వాడుంటే.. వాడి తల తన్నే వాడొకడుంటాడన్నట్లుంది అమెరికా (ఖూూ) నిఘా సంస్థ సీఐఏ (జఒూ) పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్లలోకి చొరబడి రహస్య సమాచారాన్ని ఆ సంస్థ సేకరిస్తే.. ఆ సంస్థ కంప్యూటర్లలోకి చొరబడి హ్యాకర్లు డేటాను అపహరించారు. ఇందుకోసం వాడినట్లు భావిస్తున్న సైబర్ ఆయుధం చైనా తయారీగా అనుమానిస్తున్నారు. అబ్బే మా దగ్గర రహస్య సమాచారం ఏదీ హ్యాకర్ల చేతిలో పడలేదని సీఐఏ చెబుతున్నా.. జరిగిన ఘటన అగ్రరాజ్యాన్ని ఆందోళనకు గురి చేస్తోంది.అమెరికాకు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ), ది నేషనల్ జియోస్పేషియల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, ది ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ కార్యాలయాల్లోని కంప్యూటర్లలోకి హ్యాకర్లు చొరబడ్డారు. అయితే కచ్చితంగా ఏ సమాచారం హ్యాకర్ల చేతికి వెళ్లిందో మాత్రం అధికారిక వర్గాలు వెల్లడించలేదు. రహస్య డేటా మాత్రం భద్రంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

ఏమిటీ చైనా ఆయుధం ఆర్టెక్స్..?

అమెరికా నిఘా సంస్థల కంప్యూటర్లలోకి చొరబడేందుకు చైనాలో తయారైన కృత్రిమ మేధ (ఏఐ) టూల్‌ను వాడారు. దాని పేరు ఆర్టెక్స్ (ఖూతీవఱఒ). ఈ ఏడాది ప్రారంభంలో ఓ చైనా ఇంజినీర్ దీనిని సైబర్ సెక్యూరిటీ కోసం అంటూ తయారు చేశాడు. జులై నుంచి బహిరంగంగా అందుబాటులోకి వచ్చింది. నాటి నుంచి జపాన్, దక్షిణ కొరియాలోని పలు వ్యాపార సంస్థలపై సైబర్ దాడులకు దీనిని వాడినట్లు ఆరోపణలున్నాయి. గత కొన్నేళ్లుగా చైనా ఇంటెలిజెన్స్ కాంట్రాక్టర్లు అమెరికాపై సైబర్ దాడులు చేస్తున్నారు.

ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్‌ను టార్గెట్ చేసి..

అమెరికా నిఘా వర్గాలు సేకరించిన బహిరంగ సమాచారం, వాణిజ్య పరంగా అందుబాటులో ఉన్న వివరాలు, సోషల్ మీడియా నుంచి సేకరించిన డేటా, ఉపగ్రహ చిత్రాలు, ఇతర ఆన్‌లైన్ మెటీరియల్ హ్యాకర్ల చేతికి చిక్కినట్లు తెలుస్తోంది. తమకు చేరే రహస్య సమాచారానికి వీటిని అనుసంధానించి నిఘా వర్గాలు విశ్లేషిస్తుంటాయి. ఈ సైబర్ దాడిపై సీఐఏ, ఎన్‌జీఏ స్పందించలేదు.

దలైలామా విషయంలో ఏదో సస్పెన్స్.. సైలెంట్‌గా దిల్లీలో బంగ్లా కేటాయింపు..!

అమెరికా నిఘా సంస్థలకు ఏమైంది..?

ఇటీవల అమెరికా నిఘా, భద్రతా సంస్థల్లో తరచూ సాంకేతిక లోపాలు, సైబర్ దాడులు చోటుచేసుకుంటున్నాయి. కొన్నాళ్ల క్రితం నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ కీలక నెట్‌వర్క్ మొరాయించింది. అయితే ఇది సైబర్ దాడి కాదని ఎన్ఎస్ఏ తెలిపింది. ఇక అమెరికాలోని క్రిమినల్స్, అనుమానితుల డేటాను ఎఫ్‌బీఐ నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నుంచి హ్యాకర్లు కాజేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా ధ్రువీకరించారు. దీంతోపాటు గత వారం అమెరికా వ్యవసాయ శాఖపై కూడా సైబర్ దాడి జరిగింది.

గల్లంతైన కాకినాడ మత్స్యకారులు క్షేమం

కాకినాడ జిల్లా నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి క

కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా?





- చిన్న ముసిడివాడలో ప్రభుత్వ స్థలంలో బీజేపీ కార్యాలయ నిర్మాణం
- మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆరోపణలు
- రూ.5 కోట్ల విలువైన 1,000 గజాల భూమి ఆక్రమణకు గురైందని వెల్లడి
- మరో సర్వే నంబర్‌లో 1,500 గజాల ప్రభుత్వ స్థలానికి ఫెన్సింగ్
- ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్
- స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు. ఆందోళన చేపడతామని హెచ్చరిక

పెందుర్తి, పెన్ పవర్, నవంబర్ 25 : ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతను నిర్వర్తించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తీవ్రంగా ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం, మరోవైపు ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఈరోజు పెందుర్తి మండలం, జీవీఎంసీ 117వ వార్డు పరిధిలోని చిన్న ముసిడివాడలో సర్వే నంబర్ 196/1లో ఉన్న ప్రభుత్వ భూమిని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పరిశీలించారు. సుమారు 1,000 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించి బీజేపీ కార్యాలయాన్ని నిర్మించినట్లు ఆయన ఆరోపించారు. ఈ భూమి విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.

గతంలో తొలగించిన షెడ్ల స్థానంలో మళ్లీ నిర్మాణాలు

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన అదీప్ రాజ్, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రభుత్వ స్థలంలో సుమారు తొమ్మిది షెడ్లు నిర్మించారని తెలిపారు. అప్పట్లో రెవెన్యూ అధికారుల సహకారంతో వాటిని తొలగించి ప్రభుత్వ భూమిని పరిరక్షించినట్లు వివరించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం, జీవీఎంసీ ఎన్నికల సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ భూమిని ఆక్రమించి బీజేపీ కార్యాలయ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ప్రభుత్వ భూములపై ప్రజలకు హక్కు ఉండాలని, వాటిని రాజకీయ ప్రయోజనాల కోసం లేదా వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించడం సరికాదని అన్నారు.

మరో 1,500 గజాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్..

చిన్న ముసిడివాడ ప్రాంతంలోనే సర్వే నెం. 164/10లో మరో 1,500 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే వెల్లడించారు. ఒకే ప్రాంతంలో భారీ విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

అధికారులు స్పందించాలి.. లేదంటే ఆందోళన

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించాలని, సంబంధిత సర్వే నంబర్లలో భూముల హద్దులను నిర్ధారించి ఆక్రమణలకు గురైన స్థలాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అన్నంరెడ్డి అదీప్ రాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు తగిన చర్యలు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేయడంతో పాటు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై జిల్లా యంత్రాంగం స్పందించి, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

ఆరు అంశాలపై మున్సిపాలిటీ అభివృద్ధి



- 40 వార్డులు అభివృద్ధికి కృషి
- బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్ పద్మావతి
- తొలి మీడియా సమావేశంలో చైర్‌పర్సన్ స్పష్టీకరణ

నర్సీపట్నం, పెన్ పవర్ (నవంబర్ 25) : నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చింతకాయల పద్మావతి బుధవారం తన ఛాంబర్‌లో వేద పండితుల ఆశీర్వచనాల మధ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, అభిమానులు, బంధువులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 11,519 ఓట్ల మెజారిటీతో తనను గెలిపించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం తనది కాదని, ప్రజల విజయంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లకు అభినందనలు తెలిపి, మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది సహకారంతో నర్సీపట్నాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు, డ్రైన్లు, శ్మశాన వాటికలు, కరెంట్ పోల్స్, లైట్లు, ఆసుపత్రి, పారిశుధ్యం వంటి అనేక అభివృద్ధి పనులను స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో చేపట్టామని తెలిపారు. ఇప్పటికీ పరిష్కరించాల్సిన సమస్యలు ఉన్నాయని, నర్సీపట్నం అభివృద్ధికి ఆరు సూత్రాలను దృష్టిలో పెట్టుకుని ముందుకెళ్తామని స్పష్టం చేశారు. అందులో వైద్య సదుపాయాలు, తాగునీరు, రోడ్లు, వీధి లైట్లు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ ప్రధానమైనవని వివరించారు. ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి అధికారులు, స్పీకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కౌన్సిలర్లకు సూచించారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు, ట్యాప్ కనెక్షన్ల సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. 186 పనులను ?14.16 కోట్లతో పూర్తి చేశామని, మరో 330 పనులను 36.53 కోట్లతో చేపడుతున్నామని తెలిపారు. మిగిలిపోయిన రోడ్ల పనులను కూడా తప్పకుండా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వీధి దీపాల కోసం ప్రతి పోల్ వద్ద సెన్సార్ ఏర్పాటు చేశామని, 24 గంటల్లో లైట్ సమస్యలను పరిష్కరించేలా ఏర్పాట్లు చేశామని, అలాగే మున్సిపాలిటీ లైటింగ్ కోసం 2 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. ప్రతిరోజూ చెత్త సేకరణ జరగాలని, ఆరు నెలలకు ఒకసారి స్వచ్ఛ వార్డు ప్రకటించి కౌన్సిలర్‌ను సత్కరిస్తామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం ఎనిమిది నెలల క్రితమే డీపీఆర్ సిద్ధం చేసి పంపామని, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా 24.70 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ?ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కౌన్సిలర్లతో కలిసి పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని, స్వచ్ఛ నర్సీపట్నంగా తీర్చిదిద్దుతామని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు కూడా సహకరించాలని చైర్‌పర్సన్ చింతకాయల పద్మావతి కోరారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణపై కుశల్ మిత్రాలకు అవగాహన శిక్షణ



గాజువాక :పెన్ పవర్ ,నవంబర్,25 :మహిళల ఆరోగ్య పరిరక్షణతో పాటు, వివిధ ఆరోగ్య సమస్యలపై సమాజంలో అవగాహన కల్పించి, ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో మల్కాపురంలో కుశల్ మిత్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 60 మంది మహిళా వాలంటీర్లు పాల్గొని ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు.సమాజంలో మహిళా ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న కుశల్ మిత్రాలకు రుతుక్రమ పరిశుభ్రత, మెనోపాజ్, క్యాన్సర్, మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 75వ వార్డు కార్పొరేటర్ అంగ సంధ్యారాణి మాట్లాడుతూ మహిళల జీవితాల్లో ఆరోగ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలరని అన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు వాసవ్య మహిళా మండలి చేస్తున్న కృషిని అభినందిస్తూ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.మల్కాపురం ఆరోగ్య అధికారి డాక్టర్ కె. ఉషారాణి వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. అబ్రహం సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, కుటుంబాల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వివిధ రకాల క్యాన్సర్లు, వాటి లక్షణాలు, చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు.వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ అధికారి డి. వరలక్ష్మి కుశల్ కార్యక్రమం ద్వారా మహిళలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, కుశల్ మిత్రాల బాధ్యతలను వివరించారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ భవాని రుతుక్రమ పరిశుభ్రత, ఆ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. షర్మిల మెనోపాజ్ సమయంలో మహిళల్లో కలిగే శారీరక, మానసిక మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కామాక్షి పోక్సో చట్టం, బాలల హక్కులు, వారికి కల్పించిన చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించారు.వాసవ్య మహిళా మండలి కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఉషారాణి కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, కుశల్ సిబ్బంది పార్వతి, కళావతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి...!



"కొయ్యూరు" మండలంలోని పోలీసుల ఫ్లాగ్ మార్చ్...!

కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 25 : తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కొయ్యూరు పోలీసులు ఓటర్లను కోరారు.సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి మండలంలోని చీడిపాలెం, కొయ్యూరు, రాజేంద్రపాలెం, సింగవరం రేవళ్లు గ్రామాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ ఫ్లాగ్ మార్చ్‌లో అడిషనల్ ఎస్పీ (ఏఆర్) సూర్యనారాయణ రెడ్డి , కొయ్యూరు సీఐ బి శ్రీనివాసరావు , కొయ్యూరు మరియు మంప ఎస్ఐలు కిషోర్ వర్మ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ...ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతోందని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

పాఠశాలల్లో పరిశుభ్రత,ఆరోగ్యం, పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి



గుమ్మలక్ష్మీపురం నవంబర్ 25 పెన్ పవర్.విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు వారి ఆరోగ్యం,వ్యక్తిగత పరిశుభ్రత,పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ఏపీవో మరియు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు(ఎఫ్ఏసి) సూచించారు.బుధవారం నాడు గుమ్మలక్ష్మీపురం మండలం రెగిడి గిరిజన సంక్షేమ(బాలికల) పాఠశాల, మరియు దొరజం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను,సందర్శించి,సమగ్ర తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు,వంటగది,స్నానపు గదులు,మరుగుదొడ్లు,తరగతి గదులను పరిశీలించారు.ఈ మేరకు ఏపీఓ మాట్లాడుతూ, పాఠశాల ఆవరణం పరిశుభ్రమైన వాతావరణాన్ని నిరంతరం కొనసాగించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో సమావేశమై వారి అభ్యసన సామర్థ్యాలను,ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యా పరిజ్ఞానం ఎఫ్.ఎల్.ఎం స్థాయిని పరిశీలించారు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపిస్తూ విద్యా ప్రమాణాలను పెంపొందించాలని,అభ్యసన ఫలితాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బోధనా సిబ్బందితో సమావేశమై అధికారులు నిర్దేశించిన కాలపరిమితిలో పాఠ్యాంశాలను పూర్తి చేయాలని,బోధనలో నాణ్యతను పెంపొందిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని నిర్ణీత సమయానికి విద్యార్థులకు అందించాలని,వంటగదిలో మెనూ చార్టును తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు.పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు,పరిశుభ్రత,ఆరోగ్య పరిరక్షణ,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సంబంధిత సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ మేరీ ప్రశాంతి





- కేసుల దర్యాప్తులో జాప్యం వద్దు..
- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- సిబ్బంది విధి నిర్వహణ, ప్రజలకు అందించే సేవలపై సమీక్ష

విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 25 : విశాఖపట్నం నగర పోలీస్ శాఖలో భాగంగా గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌ను డీసీపీ మేరీ ప్రశాంతి సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లోని పరిపాలనా వ్యవహారాలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తూ పోలీస్ అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీ మేరీ ప్రశాంతికి స్టేషన్ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ విభాగాలను పరిశీలించి, స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, ఇతర ముఖ్యమైన రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి నిర్ణీత సమయంలో దర్యాప్తు పూర్తి చేయాలని డీసీపీ సూచించారు. నేరాలకు సంబంధించిన ఆధారాలను సేకరించడంలో, సాక్షులను విచారించడంలో, నిందితులను గుర్తించడంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో చట్టపరమైన నిబంధనలను అనుసరిస్తూ నిందితులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొంటూ, కేసు డైరీలు, క్రైమ్ రిజిస్టర్లు, ఇతర అధికారిక పత్రాలను ఎప్పటికప్పుడు క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు చేయడంతో పాటు, ఉన్నతాధికారుల పరిశీలనకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల పోలీసులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీసీపీ మేరీ ప్రశాంతి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి నమ్మకం కలిగించే విధంగా వ్యవహరించడం పోలీసుల బాధ్యత అని పేర్కొన్నారు. చట్టపరిధిలో ప్రతి ఫిర్యాదుపై తగిన విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో డీసీపీ ప్రత్యేకంగా మాట్లాడారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులు, అవసరమైన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలని డీసీపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గోపాలపట్నం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, ఎస్సైలు రామారావు, మారయ్య, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా హింస నిరోధక దినోత్సవం సందర్భంగా పాడేరు డిగ్రీ కళాశాలలో సదస్సు

మహిళా సాధికారత, సమాజంలో స్త్రీల ప్రాముఖ్యతపై అవగాహన

పాడేరు పెన్ పవర్ : నవంబర్ 25:అంతర్జాతీయ మహిళా హింస నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఎస్. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్, గణితశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె. గౌతమి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాముఖ్యతను వివరించారు.అనంతరం కళాశాల అధ్యక్షులు డాక్టర్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర, ఆర్థికంగా స్థిరపడాల్సిన అవసరం, మహిళల్లో ఉండాల్సిన ఓర్పు, సహనం వంటి లక్షణాలను వివరించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం సభ్యులు డాక్టర్ డి. సునీత దేవి, ఎం. రాధాకుమారి, ఇ.వి. జయలక్ష్మి, డాక్టర్ సత్యవాణి, కుమారి, జీవన జ్యోతి తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతి ఓటరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- గ్రామాభివృద్ధికి కృషి చేసే నాయకుడిని ఎన్నుకోండి: పీసా నాయకులు





గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 25:నేడు జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని గూడెంకొత్తవీధి మండల పీసా అధ్యక్షుడు కొర్ర బలరాం, ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజాసేవే ధ్యేయంగా పనిచేసే మంచి నాయకుడిని సర్పంచ్‌గా ఎన్నుకోవాలని కోరారు. ప్రతి ఓటు విలువైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.మండలంలోని ప్రతి పంచాయతీలో శతశాతం పోలింగ్ జరిగేలా ప్రజలు చైతన్యంతో ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలంటే ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని పీసా నాయకులు కోరారు.

ఎన్నికల నేపథ్యంలో నేటి జీకేవీధి వారపు సంత వాయిదా!

ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 25:పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గూడెంకొత్తవీధిలో గురువారం జరగాల్సిన వారపు సంతను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు బుధవారం తెలిపారు. ఈ నెల 26న పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, శతశాతం ఓటింగ్ లక్ష్యంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గురువారం జరగాల్సిన వారపు సంతను శుక్రవారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వ్యాపారులు, ప్రజలు ఈ మార్పును గమనించి అధికారులకు సహకరించాలని ఎంపీడీవో రమణబాబు కోరారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి.. పోలీసులకు సహకరించాలి

జీకేవీధి ప్రజలకు ఎస్సై సురేష్ విజ్ఞప్తి



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 25:ఈ నెల 26న(నేడు)జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో జీకేవీధి మండల ప్రజలు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై కె. సురేష్ విజ్ఞప్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల లోపు ఎలాంటి ప్రచారం నిర్వహించరాదని, ఎన్నికలకు సంబంధించిన నినాదాలు, ప్రచార కార్యక్రమాలు, సమావేశాలు చేపట్టకూడదని సూచించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని వెంటనే తిరిగి వెళ్లాలని తెలిపారు.సెక్షన్ 163 బీఎన్ఎస్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ప్రజలు గుంపులుగా గుమికూడరాదని, నిషేధాజ్ఞలను ఉల్లంఘించరాదని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతి ఒక్కరూ క్యూ పద్ధతిని పాటించాలని, ఎలాంటి గొడవలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని సూచించారు.ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి సహకరించి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై సురేష్ కోరారు.

సర్పంచ్ ఎన్నికల విధులకు తరలి వెళుతున్న పోలింగ్ సిబ్బంది...!



కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 25: మండల కేంద్రంలో పంచాయితీ ఎన్నికల విధులకు సిబ్బంది బుధవారం బయలుదేరి వెళుతున్నారు. బుధవారం ఉదయం నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాల ఆవరణలో ఎన్నికల విధులకు వెళ్లే పోలింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఎన్నికల సామాగ్రిని అందజేశారు. బ్యాలెట్ బాక్స్, డిస్పే చేసే బోర్డులు, వికలాంగులకు ఉపయోగించే వీల్ చైర్లు తో సహా ఓటింగ్ సరిపడే సామాగ్రి అందజేశారు. ఇప్పటికే కొయ్యూరు మండలంలో ఒక పంచాయతీ ఏకగ్రీవం, అలాగే 47 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి, మిగతా 32 పంచాయితీల్లో రెండు వందల నలభై మూడు వార్డు సభ్యులకుఎన్నికలు జరగాల్సి ఉంది.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి శ్రీనివాసరావు

వెల్లడి:

ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పంచాయితీ ఎన్నికల అధికారి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయితీ సర్పంచ్ఎన్నికలు జరిగేటప్పుడు ఇతరులను ఎవరిని పోలింగ్ బూత్ వద్దకు రాకుండా పోలీస్ సిబ్బంది తగు చర్యలు తీసుకుంటారని ఈ సందర్భంగా సిఐ తెలిపారు.

ఎన్నికల వేళే ప్రజా సమస్యలు గుర్తుకొచ్చాయా?

అధికారంలో ఉండి పరిష్కరించని సమస్యలపై ఇప్పుడు హామీలెందుకు?

గిడ్డి ఈశ్వరి ప్రకటనలను ఖండించిన మాజీ జడ్పీటీసీ పోతురాజు బాలయ్య.

చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 25 . ఎన్నికల సమయంలోనే ప్రజా సమస్యలు గుర్తుకొస్తాయా? అధికారంలో ఉన్నప్పుడు పరిష్కరించని సమస్యలపై ఇప్పుడు హామీలు గుప్పించడం ఏమిటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చింతపల్లి తాజా మాజీ జడ్పీటీసీ పోతురాజు బాలయ్య ప్రశ్నించారు. గిరిజనేతరులకు విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తామని, గిరిజన సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి చేసిన ప్రకటనలను ఆయన ఖండించారు. రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ గిరిజనేతరుల విద్యుత్ మీటర్ల సమస్యను ఎందుకు పరిష్కరించలేదని నిలదీశారు. జీవో నంబరు 3ను సవరిస్తామని, తిరిగి తీసుకొస్తామని గతంలో ప్రకటనలు చేసినా ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మెగా డీఎస్సీతో పాటు తాజాగా చేపట్టిన డీఎస్సీలోనూ గిరిజనులకు తగిన న్యాయం జరగలేదని విమర్శించారు. రహదారుల విస్తరణతో గిరిజనులు, గిరిజనేతరులు, వ్యాపారులు నష్టపోయే అవకాశం ఉందని, వీటిపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికల వేళ హామీలు ఇవ్వడం సరికాదన్నారు. ముందుగా హామీలను అమలు చేసి ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జడ్పీటీసీలు, ఎంపీపీలుగా తాము చింతపల్లి మండలంలో జడ్పీ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని బాలయ్య తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశామని పేర్కొన్నారు. పదవుల్లో ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని స్పష్టం చేశారు. గతంలో తాము చేసిన అభివృద్ధి పనుల గురించి తెలుసుకుని విమర్శలు చేయాలని హితవు పలికారు. అన్నవరం నుంచి నీటిని తరలించే తాగునీటి పథకంపై జరుగుతున్న ప్రచారాన్ని బాలయ్య తప్పుబట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.22 కోట్లతో 40 గ్రామాలకు తాగునీరు అందించే పథకానికి ప్రాజెక్టు రూపొందించి ప్రభుత్వానికి



పంపించామని వెల్లడించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పూర్తి చేస్తే స్వాగతిస్తామని తెలిపారు. అయితే నాలుగు పంచాయతీల పరిధిలోని 40 గ్రామాలకు ఉద్దేశించిన పథకాన్ని కేవలం చింతపల్లి పంచాయతీకి సంబంధించినదిగా ప్రచారం చేయడం సరికాదన్నారు. లోతుగడ్డ, చౌడుపల్లి, చింతపల్లి, అన్నవరం పంచాయతీలకు ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. విద్యుత్ మీటర్ల మంజూరు అంశం విద్యుత్ కమిషన్ పరిధిలోనిదని, నిబంధనలకు అనుగుణంగానే ప్రక్రియ సాగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి అంశాలను ఎన్నికల సమయంలో రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం తగదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ముందుగా నెరవేర్చి, అభివృద్ధి పనులు చేసి చూపించిన తర్వాతే ప్రచారం చేసుకోవాలని గిడ్డి ఈశ్వరికి బాలయ్య సూచించారు.

ప్రజా సమస్యపై తక్షణ స్పందన.. పైప్‌లైన్ లీకేజీకి పరిష్కారం!



ప్రజల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించిన కార్పొరేటర్ శ్యామ్

విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 25 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 73వ వార్డు కార్పొరేటర్, జనసేన పార్టీ నాయకుడు శ్యామ్ సుధాకర్ ప్రజా సమస్యపై వెంటనే స్పందించి, నీటి పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపారు. నిన్న ఎల్లిపువనపాలెం ప్రాంతంలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో పర్యటన నిర్వహించిన సందర్భంగా అక్కడ నీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ సమస్యను కార్పొరేటర్ శ్యామ్ సుధాకర్ గుర్తించారు. పైప్‌లైన్ నుంచి నీరు వృథాగా బయటకు వస్తుండటంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న విషయాన్ని ఆయన గమనించారు. సమస్యను గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత నీటి సరఫరా అధికారులకు సమాచారం అందించి, లీకేజీని త్వరితగతిన అరికట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన నీరు వృథా కాకుండా చూడటంతో పాటు, నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ సూచనల మేరకు సంబంధిత నీటి సరఫరా అధికారులు ఈరోజు వెంటనే స్పందించి, ఎల్లిపువనపాలెం ఆంజనేయస్వామి గుడి సమీపంలోని పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికంగా నెలకొన్న సమస్యకు పరిష్కారం లభించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అందించడం ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావిస్తున్నామని ఈ సందర్భంగా శ్యామ్ సుధాకర్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, వార్డు పరిధిలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు స్పందన.. పరిష్కారంలో చొరవ.. ఇదే ప్రజాసేవకు నిదర్శనం.

గడుగుపల్లిలో విషాదం

- వైసీపీ కార్యకర్త సంపన్న మృతి
- సంపన్న కుటుంబానికి అండగా ఉంటాం
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వంతల శాంతి



పాడేరు/పెదబయలు పెన్ పవర్:నవంబర్ 25: అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయతీ పరిధిలోని గడుగుపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకుంది ..వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వీర విధేయుడు పార్టీ ఆవిర్భావం నుంచి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ అందరితో కలివిడిగా ఉండే పాంగి సంగన్న (45)గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు మంగళవారం రాత్రి పరిస్థితి విషమించి మృతిచెందారు. ఆయనకు భార్య దేవి , నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది.
విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వంతల శాంతి గడుగుపల్లి గ్రామానికి చేరుకుని సంగన్న భౌతికకాయానికి పూలమాల వేసి , నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గంగన్న కుటుంబానికి తామంతా అండగా ఉంటామని, కష్టకాలంలో ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మాజీ జెడ్పీటీసీ బొంజు బాబు, వైసీపీ నాయకులు వంతల రామన్న తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం... యువకుడు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు మెరుగైన వైద్యం కొరకు తరలింపు



కొయ్యూరు, పెన్ పవర్ నవంబర్ 25 : కొయ్యూరు మండలం కాకరపాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కొయ్యూరు మండలం ఎం మాకవరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పొడుగు రత్నం కుమారుడు లోవ ప్రసాద్(25),అదే గ్రామానికి చెందిన మరో యువకుడు కోడా రమేష్ ద్విచక్ర వాహనంపై ఎం మాకవరం నుండి కొయ్యూరు వైపు వస్తుండగా పిట్టచలం కాకరపాడు గ్రామాల మధ్యన ప్రమాదానికి గురయ్యారు. ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ జాతీయ రహదారి మలుపులో అదుపు చేయలేక రోడ్డు పక్కన గల ఐరన్ కంచెను ఢీకొట్టారు. ఈ ఘటనలో పొడుగు లోవప్రసాద్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చందగా మరో యువకుడు రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని రాజేంద్రపాలెం పి హెచ్ సి కి తరలించి మెరుగైన వైద్యం కొరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ తన సిబ్బందితో ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. కొయ్యూరు తాసిల్దార్ ప్రసాద్ బాబు ఘటనాస్థలికి వెళ్లి ప్రమాద తీవ్రతను పరిశీలించారు. ఈ ఘటనపై మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి మృతదేహాన్ని పీఎం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నవంబర్ 28న అరకులోయలో మెగా జాబ్ మేళా

10 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు

అరకులోయ, పెన్ పవర్ నవంబర్ 25:అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో శ్రీకాకుళం, జిల్లా ఉపాధి కల్పన విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 28న అరకులోయలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ తెలిపారు.ప్రభుత్వ ఐ . టి . ఐ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ జాబ్ మేళాలో సుమారు 10 ప్రముఖ మల్టీనేషనల్, కార్పొరేట్ కంపెనీలు పాల్గొని నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి.10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు.జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జి. ప్రశాంత్ కుమార్ కోరారు.

ర్యాలిలో పంచాయతీ ఎన్నికల సమరం.. త్రిముఖ పోరుతో రాజకీయ వేడి!





- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థుల ముమ్మర ప్రయత్నాలు
- కత్తెర, ఉంగరం, మంచం గుర్తుల మధ్య ఆసక్తికర పోటీ
- 12 వేల మంది ఓటర్లు.. 16 వార్డులతో ఎన్నికల బరిలో హోరాహోరీ

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 25: కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ మేజర్ పంచాయతీలో పంచాయతీ ఎన్నికల రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతోంది. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ గ్రామంలో రాజకీయ సమీకరణాలు మారుతూ, అభ్యర్థుల ప్రచార వ్యూహాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. సర్పంచ్ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రధాన అభ్యర్థులు తమ అనుచరగణంతో రంగంలోకి దిగి ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు విస్తృతంగా ప్రయత్నిస్తున్నారు. గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి వార్డు ఎన్నికల ప్రచారంతో సందడిగా మారుతోంది.

మూడు వర్గాలు.. మూడు గుర్తులు.. త్రిముఖ పోరు!

ర్యాలి గ్రామంలో సర్పంచ్ పదవికి ప్రధానంగా మూడు అభ్యర్థులు పోటీలో నిలవడంతో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. మాజీ సర్పంచ్ పేర్చెర్ల పల్లంరాజు వర్మ సమక్షంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన అభ్యర్థిగా మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణ కత్తెర గుర్తుపై ఎన్నికల బరిలో నిలిచారు. కూటమి మద్దతుతో గ్రామంలో తమ రాజకీయ బలాన్ని చాటుకునేందుకు ఆమె వర్గీయులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.మరోవైపు రెబల్ అభ్యర్థి వర్గం నుంచి మద్దూరి సుబ్బారావు మద్దతుతో ఆయన కోడలు మద్దూరి వెంకట నాగసూర్యకుమారి సూరిబాబు ఉంగరం గుర్తుపై పోటీకి దిగారు. దీంతో ఒకే రాజకీయ నేపథ్యానికి చెందిన వర్గాల మధ్య కూడా పోటీ నెలకొన్నట్లు గ్రామ రాజకీయాల్లో చర్చ సాగుతోంది. కుటుంబ సంబంధాలు, స్థానిక రాజకీయ అనుబంధాలు, వ్యక్తిగత పరిచయాలు ఎన్నికల ప్రచారంలో ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.

ఇక మూడో అభ్యర్థిగా బహుజన్ సమాజ్ పార్టీ తరఫున చిగురుపాటి సుజాత మంచం గుర్తుపై ఎన్నికల బరిలో నిలిచారు. ఈ విధంగా కత్తెర, ఉంగరం, మంచం గుర్తులతో ముగ్గురు అభ్యర్థులు సర్పంచ్ పదవికి పోటీ పడుతుండటంతో ర్యాలి గ్రామంలో త్రిముఖ ఎన్నికల సమరం నెలకొంది.

12 వేల మంది ఓటర్లు.. 16 వార్డులపై ప్రత్యేక దృష్టి

ర్యాలి మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో ఈ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. గ్రామంలో సుమారు 12 వేల మంది ఓటర్లు ఉండగా, 16 వార్డుల్లో వార్డు సభ్యుల ఎన్నికలు కూడా జరగనున్నాయి. దీంతో సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు సభ్యుల అభ్యర్థులు సైతం తమ తమ ప్రాంతాల్లో ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నారు. వార్డుల వారీగా ఓటర్లను కలుసుకుంటూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

ప్రతి వార్డులోనూ స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలు, గ్రామ అభివృద్ధిపై చర్చలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలు ఎన్నికల ప్రచారంలో ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అభ్యర్థులు ఓటర్లకు హామీలు ఇస్తున్నారు.అదే సమయంలో 16 వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా తమ అనుచరులతో కలిసి ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు. సర్పంచ్ అభ్యర్థుల విజయావకాశాలపై వార్డు స్థాయి మద్దతు ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ప్రతి ఓటును కీలకంగా భావిస్తూ అభ్యర్థులు ముందుకు సాగుతున్నారు. గ్రామంలోని రాజకీయ వర్గాలు తమ తమ బలాబలాలను అంచనా వేసుకుంటూ ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నాయి.



గ్రామ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు.. ఓటరు తీర్పుపై ఆసక్తి!ర్యాలి గ్రామంలో నెలకొన్న ఈ పోటీ కేవలం సర్పంచ్ పదవికే పరిమితం కాకుండా స్థానిక రాజకీయ బలాబలాలకు ప్రతిబింబంగా మారుతోంది. ఒకవైపు కూటమి బలపరిచిన అభ్యర్థి, మరోవైపు రెబల్ అభ్యర్థి, ఇంకోవైపు బీఎస్పీ అభ్యర్థి తమదైన ప్రచార పంథాలో ముందుకు సాగుతున్నారు. ఈ మూడు వర్గాల మధ్య ఓటర్ల మద్దతు ఏ విధంగా విభజించబడుతుందన్నది ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ఈ నెల 29న జరగనున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి మరింత ఊపొచ్చే అవకాశం ఉంది. అభ్యర్థులు చేస్తున్న హామీలు, గ్రామాభివృద్ధిపై వెల్లడిస్తున్న ప్రణాళికలు, ప్రజలతో ఏర్పరుచుకుంటున్న సంబంధాలు ఓటర్ల నిర్ణయంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాల్సి ఉంది.చివరికి అభ్యర్థుల వ్యూహాలు ఎంత పదునుగా ఉన్నా.. ఓటరు మనసులో ఏముందో ఎవరూ ఊహించలేరు. ప్రచార ఆర్భాటాలకు, రాజకీయ సమీకరణాలకు అతీతంగా ర్యాలి గ్రామ ఓటర్లు ఎవరికి పట్టం కడతారు? కత్తెరకు, ఉంగరానికి, మంచానికి మధ్య ప్రజాస్వామ్య తీర్పు ఎవరిని విజేతగా నిలబెడుతుంది? అన్నది ఎన్నికల ఫలితాలే నిర్ణయించనున్నాయి.

ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపుపై ఆర్వోలు, పీడీవోలతో సమావేశం



గండేపల్లి, పెన్ పవర్, నవంబర్, 25:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో హరికృష్ణ సత్యారెడ్డి ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ

ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రెండో దశ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), పంచాయతీ కార్యదర్శులతో (పీడీవోలు) సమావేశం నిర్వహించారు. ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఓట్ల లెక్కింపు విధానం, ఎన్నికల నిబంధనల అమలుపై సమావేశంలో సమీక్షించి అధికారులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో లు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మీ కలలకు కోడింగ్ చేయండి: విజయం ఆదిత్య లో స్ఫూర్తి దాయక ప్రసంగాలతో విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన శ్రీ మహర్షి

గండేపల్లి, పెన్ పవర్, నవంబర్ 25:గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఫ్రెషమన్ ఇంజినీరింగ్ విభాగం: విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, పట్టుదల, సానుకూల దృక్పథాన్ని పెంపొందించి, తమ లక్ష్యాలను ధైర్యంగా సాధించేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో " (మీ కలలకు కోడింగ్ చేయండి: విజయం వైపు ఒక ప్రయాణం) అనే అంశంపై ది. 23 నుండి 25 మూడు రోజుల పాటు ఒక స్ఫూర్తిదాయకమైన ప్రేరణాత్మక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లిశ్రీ మహర్షి, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ మరియు మ్యాథ్స్ గార్డెన్ క్రియాశీల సభ్యులు ముఖ్య వక్తగా పాల్గొని, ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నతమైన కలలు కనాలని, అభివృద్ధి దృక్పథాన్ని అలవర్చుకోవాలి, తమ ఆశయాలను సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని ఆయన ప్రోత్సహించారు. విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకోవడంలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు నిరంతర అభ్యాసం ఎంతో కీలకమని వివరించారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌ను జీవితానికి అన్వయిస్తూ, ఒక విజయవంతమైన ప్రోగ్రామ్‌ను రూపొందించడానికి తార్కిక ఆలోచన, తప్పులను గుర్తించడం, వాటిని సరిదిద్దడం, పదేపదే సాధన చేయడం ఎంత అవసరమో, జీవితంలో విజయం సాధించడానికి కూడా సహనం, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం మరియు అపజయాల నుంచి పాఠాలు నేర్చుకునే గుణం అంతే అవసరమని వివరించారు. అపజయాలను అడ్డంకులుగా భావించకుండా, వాటిని నేర్చుకోవడానికి, తమను తాము మెరుగుపరుచుకోవడానికి మరియు ముందుకు సాగడానికి లభించే అవకాశాలుగా స్వీకరించాలని ఆయన సూచించారు. సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానానికి సమానంగా అవసరమైన సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని, తమ వ్యక్తిగత మరియు వృత్తిపరమైన ఎదుగుదలకు ప్రతి విద్యార్థి బాధ్యత వహించాలని ప్రోత్సహించారు. ఈ పరస్పర చర్చా తృక కార్యక్రమం విద్యార్థులు తమ సంకోచాలను అధిగమించి, తమ పరిధిని విస్తరించుకుంటూ, నిరంతర కృషి మరియు నిబద్ధతతో తమ కలలను సాధించగల లక్ష్యాలుగా మార్చుకునేలా స్ఫూర్తినిచ్చింది. సాంకేతిక నైపుణ్యంతో పాటు జీవితానికి అవసరమైన నైపుణ్యాలను సమతుల్యంగా అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఈ కార్యక్రమం చాటి చెప్పింది. "ఉన్నతమైన కలలు కనండి, తార్కికంగా ఆలోచించండి, నిరంతరం నేర్చుకోండి... మీ విజయానికి మీరే బాటలు వేసుకోండి! అంటూ సాగిన స్ఫూర్తి దాయక ప్రసంగాలు విద్యార్థులు నూతన ఉత్సాహంతో, స్పష్టమైన భవిష్యత్ లక్ష్యంతో తమ విద్యా ప్రయాణంలో ముందుకు సాగేందుకు ఈ ప్రసంగం ఎంతో ప్రేరణనిచ్చింది. ఈ కార్యక్రమంలో డీన్ డా. ఏ.వానతి విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్సిటీ లో "శ్రీ సహస్ర చండీ యాగం"



గండేపల్లి, పెన్ పవర్, నవంబర్ 25:కాకినాడ జిల్లా సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయం నందు ది .03-12- 2026నుంచి 07-12-2026 వరకు చతుర్వేద పారాయణం పురస్సర "శ్రీ సహస్ర చండీ యాగం" నిర్వహించనున్నట్లు ప్రో.ఛాన్సలర్ డా.నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. "శ్రీ సహస్ర చండీ యాగం" ఉదయం 5:00 గంటల నుండి గణపతి పూజా కార్యక్రమం తో ప్రారంభమౌతుంది అని ఆదిత్య విద్యాసంస్థల అధినేత డా.నల్లమిల్లి శేషారెడ్డి తెలియజేశారు. ప్రతి రోజు ఉదయం. 8-00 నుండి మధ్యాహ్నం 12-30 చండీ హోమం,చతుర్వేద పారాయణం,రుద్రాభిషేకం,సూర్యనమస్కారాలు,సుందరకాండ పారాయణ, సాయంత్రం 5-30 గం.ల నుండి రాత్రి 8-00 గంటల వరకు చండీ హోమం,చతుర్వేద పారాయణం నీరాజన మంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విశ్వవిద్యాలయం చాన్సలర్ నల్లమిల్లి శేషారెడ్డి, శ్రీమతి రాజ్యలక్ష్మి, ప్రో చాన్సలర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి శ్రీమతి శృతి రెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి కృష్ణ దీపక్ రెడ్డి శ్రీమతి సుగుణ రెడ్డి, మరియు 100 మంది ఋత్విక్కులు ఈ యాగం నిర్వహణకు పాల్గొంటారని తెలిపారు.

జాతీయ రహదారిపై బస్సు--లారీ ఢీ

10 మందికి తీవ్ర గాయాలు.. ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు



గండేపల్లి, నవంబరు 25, పెన్ పవర్:కాకినాడ జిల్లా గండేపల్లి మండలం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, డివైడర్ దాటి వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది.

ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సిబ్బంది వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.సమాచారం అందుకున్న గండేపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మంచం గుర్తుపై ఓటేసి గెద్దనాపల్లి సర్పంచ్ గా గెలిపించండి.

- ప్రజాసేవే లక్ష్యంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా.
- గెద్దనాపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఇనకోటి గంగాధర ప్రజలకు విజ్ఞప్తి



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్, 25:మంచం గుర్తుపై ఓటు వేసి గెద్దనాపల్లి గ్రామ సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రజాసేవే లక్ష్యంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని గెద్దనాపల్లి గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి ఇనకోటి గంగాధర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీమోహన్ ఆశీస్సులతో ఎన్నికల బరిలో నిలిచిన ఆయన బుధవారం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. మంచం గుర్తుపై ఓటు వేసి తనను సర్పంచ్‌గా గెలిపించాలని ఓటర్లను పేరుపేరునా అభ్యర్థించారు. ఒక్క అవకాశం కల్పిస్తే గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతో పాటు ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల అమూల్యమైన ఓటుతో అఖండ మెజారిటీ అందించి ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ముద్రగడ రమేష్ కు ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యులు పరామర్శ.



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్, 25:సీనియర్ జర్నలిస్టు ముద్రగడ రమేష్ ను ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యులు బుధవారం పరామర్శించారు.రమేష్ తండ్రి ముద్రగడ కాశీవిశ్వనాథం ఈనెల 18వ తేదీ బుధవారం అకాల మృతి చెందారు.దీంతో విషయం తెలుసుకున్న ప్రెస్ క్లబ్ సభ్యులు ముద్రగడ రమేష్ ను బుధవారం పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. కాశీవిశ్వనాథం చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి తండ్రి స్వర్గీయ కాశీ విశ్వనాథం ఆత్మ శాంతి చేకూరాలని పాత్రికేయ సభ్యులు సంతాపం తెలిపారు .ఈ కార్యక్రమంలో తోటి జర్నలిస్టులు మిత్రులు ఉడతా అప్పారావు, మొల్లేటి సాంబశివ, పెనగంటి గోవిందరావు, తుమ్మల సుబ్బు, చెప్పుల రాంబాబు, యసమల జ్యోతిబాబు, మిత్రులు,బంధువులు కపిలవాయి సూరిబాబు, ముద్రగడ మహేశ్వరరావు, ముద్రగడ పెద్దకాపు, ముద్రగడ శివసత్య హరి ప్రసాద్, చెక్కపల్లి రాంబాబు, తూము కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చినశంకర్లపూడిలో అంగరంగ వైభవంగా వేగులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట.

-ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు.



కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్ నవంబర్, 25:కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చిన శంకర్లపూడి గ్రామంలో వేగులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని చింతాల వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాళ్ల మంగాదేవిజగదీష్, జడ్పీటీసీ రొంగల సత్యనారాయణ, స్థానిక నాయకులు మిరియాల శ్రీను, కాశపు బుజ్జి, పెదకాపు, అంబటి రాంబాబు, అడ్డాల త్రిమూర్తులు, రామిశెట్టి శ్రీనివాస్, బద్దేటి శ్రీను, తంగెళ్ల సత్యనారాయణ, కూటమి నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచి ధైర్యం చెప్పిన మాజీ ఎంపి గీత



పిఠాపురం, పెన్ పవర్, నవంబర్ 25 : నియోజకవర్గంలోని ఉప్పాడ సుబ్బంపేట గ్రామానికి చెందిన గరికిన సింహాద్రితో పాటు మరో 6 మంది మత్స్యకారులు ఈ నెల 4వ తేదీన వేటకు వెళ్లి ఇప్పటివరకు ఆచూకీ లేకుండా ఉన్నారు. ఈ విషయం తెలియగానే మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చొరవతో కాకినాడ మాజీ ఎంపి వంగా గీతావిశ్వనాథ్ జిల్లా కలెక్టర్ హరింద్ర ప్రసాద్ తో మరియు అధికార యంత్రాంగంతో మాట్లాడి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. బుధవారం ఆచూకీ లభించని మత్స్యకార కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పి, మీకు మేమున్నాం అని భరోసా ఇచ్చారు. ఆ 7 మంది మత్స్యకారులు క్షేమంగా తిరిగి వస్తారని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బి.వి.సి. ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



అల్లపరం,పెన్ పవర్, నవంబర్:ఓడలరేవులోని బోనం వెంకట చలమయ్య సాంకేతిక కళాశాల (స్వయంప్రతిపత్తి) లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ (సంవిధాన్ దివస్) వేడుకలను కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.) విభాగం, 'నా భారత్' బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎన్.ఎస్.ఆర్. రత్నాకరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ రత్నాకరరావు మాట్లాడుతూ,భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని, ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం మరియు సౌభ్రాతృత్వం వంటి విలువలను అందించిందని పేర్కొన్నారు. విద్యార్థులు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు ప్రాథమిక విధులను కూడా తెలుసుకొని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ ఆకుల, బహుళ సాంకేతిక విద్యా విభాగ (పాలిటెక్నిక్) ప్రధానాచార్యులు డాక్టర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ,రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ తమ నిత్యజీవితంలో పాటించాలని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.ప్రత్యేక అతిథిగా పాల్గొన్న రాణి శ్రీవల్లి సత్య యువ నాయకత్వం మరియు 'వికసిత భారత్ 2047' లక్ష్యాలపై ప్రసంగించారు. ఆమె 'వికసిత భారత్ యువ నాయకుల సదస్సు – 2026' లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున తుది విజేతల జాబితాలో నిలవడంతో పాటు, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖచే 'యువ ఆదర్శమూర్తి'గా ఎంపికయ్యారు. యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం వంటి అంశాలను ఆమె వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు మరియు పౌరుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తూ, 2047 నాటికి 'వికసిత భారత్' సాధనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షురాలు డాక్టర్ బోనం కనకదుర్గ, పరిపాలనాధికారి ఏ.వై.ఆర్.వి. ప్రసాద్, కళాశాల అధ్యాపకులు, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్బీఐ ఆధ్వర్యంలో అప్ లిఫ్ట్ అవగాహన సదస్సు



పిఠాపురం, పెన్ పవర్, నవంబర్ 25 : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ఆదర్శ ఇంజనీరింగ్ కళాశాలలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఆధ్వర్యంలో విద్యార్థులకు అప్ లిఫ్ట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకింగ్ అవగాహన, పెట్టుబడులు, సైబర్ మోసాలు అనే అంశాలపై ఈ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్బీఐ మేనేజర్ రామకృష్ణ, కాకినాడ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సిహెచ్.ఎస్.వి.ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులు, పొదుపు, పెట్టుబడుల ఆవశ్యకత, డిజిటల్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెరుగుతున్న సైబర్ నేరాల నుండి ఎలా అప్రమత్తంగా ఉండాలో విద్యార్థులకు వివరించారు. ఓటిపి, పిన్, బ్యాంక్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వై.వి.ఎన్. రాజశేఖర్, డీన్ ఆర్&డి డా. ఎస్.వి.ఆర్.కె.రావు, టిపిఓ టి. ప్రేమ్ బోస్కో, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.సుబ్బారావు, ఇంగ్లీష్ ప్రొఫెసర్ డా. కె.రామారావు పాల్గొన్నారు. ఈ విలువైన కార్యక్రమాన్ని తమ కళాశాలలో నిర్వహించినందుకు ఆర్బీఐ అధికారులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ (ఎస్.ఎస్.టి) డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుమంత్ మరియు పిఠాపురం ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ షేక్ దాదా, బి.రత్నరాజు, ఎండి ఇర్ఫాన్ పాల్గొన్నారు.

త్రై సాధన ద్వారానే మానవ జన్మ సార్థక్యం చేసుకోగలం - పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి



ప్రత్తిపాడు (బవురువాక), పెన్ పవర్, నవంబర్ 25 : శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి అంతర్జాలం ద్వారా మాట్లాడుతూ తమ అష్టమ పీఠాధిపతి పరబ్రహ్మ శ్రీ మొహిద్దీన్ బాద్షా గారు ధ్యానం చేసిన ఈ పుణ్య భూమిలో కూర్చున్న ప్రతీ ఒక్కరూ త్రయీ సాధన అనగా మహా మంత్ర సాధన ద్వారా భుక్తిని, జ్ఞాన సాధన ద్వారా తృప్తిని, ధ్యాన సాధన ద్వారా ముక్తిని పొంది మానవ జన్మ సార్థక్యం చేసుకోవాలి అనుగ్రహ భాషణ చేసారు. అనంతరం సభాధ్యక్షుడు అహ్మద్ ఆలీషా మాట్లాడుతూ ఏకాగ్రతతో గురువును విశ్వసించి జ్ఞాన మార్గంలో నడుచుకుంటూ నీలో ఉన్న మాలిన్యాన్ని నిర్మూలించుకోవాలి అన్నారు. మరో సోదరుడు మహబూబ్ పాషా మాట్లాడుతూ పరబ్రహ్మ శ్రీ మొహిద్దీన్ బాద్షా స్వామి వారు ప్రభోధించిన ఆధ్యాత్మికత ద్వారా సజ్జనత, జిజ్ఞాసా సమాజంలో సంస్కారవంతంగా నడుచుకోవాలి అన్నారు. మరో సోదరుడు కబీర్ షా మాట్లాడుతూ తమ తండ్రి గారి భోధనలు ఆచరిస్తూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. బవురువాకను బంగారు భూమిగా అభివర్ణించారు. మరో సోదరుడు శ్రీ హుస్సేన్ షా మాట్లాడుతూ తమ తండ్రి గారు తపస్సు చేసిన ప్రదేశంలో నడయాడే అదృష్టం లభించి నందుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతుల సోదరి జరినా కుతుబుద్దీన్, ఆదిల్ మరియు గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నందా అప్పారావు, వైస్ సర్పంచ్ గెడ్డం రమణ, దొడ్డి మంగమ్మ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని సెంట్రల్ కమిటీ మెంబెర్ ఎన్టీవీ ప్రసాద వర్మ కార్యక్రమం నిర్వహించారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు ప్రసంగించారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు 180 దుప్పట్లు పంపిణీ చేసారు.

నేడు కాకినాడ లోని ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి - డా అడ్డాల



కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 25 ; ప్రజలను పాలించే ప్రతినిధులను ఎన్నుకోవడానికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఒక మహత్తర అవకాశం ఓటు హక్కు అని దానిని బాధ్యతగా వినియోగించాలని డా అడ్డాల సత్యనారాయణ విజ్ఞప్తి చేసారు. నేడు జరుగనున్న నగరపాలక సంస్థ ఎన్నికలలో మంచి అభ్యర్థులను తమ అభ్యర్థులుగా ఎంపిక చేసుకుంటే అభివృద్ధికి పట్టం కడతారని అన్నారు. మన స్వచ్ఛ మరియు సురక్షిత కాకినాడ కోసం ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కుతోనే సమాజాభివృద్ధి కాబట్టి ప్రతి ఒక్కరు ఓటును సద్వినియోపరుచుకోవాలని అన్నారు. కొందరు ఓటు వేయడం పట్ల నిర్లిప్తత చూపడం బాధాకరమన్నారు. ఓటును ప్రాథమిక హక్కుగా గుర్తించి ప్రతి ఒక్కరూ ఓటు వేయడం బాధ్యతగా భావించాలని డా అడ్డాల కోరారు.

నిరుద్యోగులు మెగా జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలి



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 25: నిరుద్యోగులు మెగా జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. చెన్నారావు అన్నారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 120 మందికి పైగా హాజరు కాగా, 107 మంది నైపుణ్యం పోర్టల్ లో రిజిస్టర్ అయ్యారు. చివరకు 26 మంది అభ్యర్థులు షార్ట్ లిస్ట్ అవ్వగా 8 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిన్నారావు మాట్లాడుతూ ఏదైనా సాధించాలంటే పట్టుదల కృషి ఉండాలని సమయం కోసం వేచి చూడాలన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని వారి కుటుంబాలకు అండగా నిలబడాలన్నారు. నిరుద్యోగులు అందరూ వారి విద్యార్హత, నైపుణ్యం ఆధారంగా తగిన కంపెనీ ఎంచుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీఎన్ఎస్ డిడిసి ప్లేస్మెంట్ ఆఫీసర్ లోవబాబు, సిఆర్ఓ శివరాం, అధ్యాపకుడు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో వాడపల్లి స్వామివారికి వెండి శఠగోపం సమర్పణ



రూ.55 వేల విలువైన 266 గ్రాముల వెండి శఠగోపం

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 25:కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తి, ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భగవంతునిపై తమకున్న అపారమైన భక్తిశ్రద్ధలను చాటుకుంటూ భీమవరం పట్టణానికి చెందిన బొడసింగ్ రామారావు, లక్ష్మి కుటుంబ సభ్యులు స్వామివారి దేవస్థానానికి వెండి శఠగోపాన్ని భక్తిపూర్వకంగా సమర్పించారు.

266 గ్రాముల బరువున్న ఈ వెండి శఠగోపం విలువ సుమారు రూ.55,000గా తెలియజేశారు. స్వామివారి పట్ల తమకున్న విశ్వాసం, ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీకగా కుటుంబ సభ్యులు ఈ కానుకను సమర్పించడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు సమర్పించారు. అనంతరం ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధర్ రావు దాత కుటుంబ సభ్యులను అభినందించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.దేవస్థానాలకు భక్తులు సమర్పించే కానుకలు భగవంతునిపై వారికున్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. వాడపల్లి క్షేత్రానికి భక్తులు అందిస్తున్న ఇటువంటి ఆధ్యాత్మిక కానుకలు ఆలయ వైభవాన్ని మరింత పెంపొందిస్తున్నాయి.

స్త్రీ అంటే సృష్టికి మూలం. ఆమెను రక్షించుకోవడం మన బాధ్యత - డా అడ్డాల



కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 25 : నగరంలోని నాగమల్లి తోట వద్ద ఉన్న టీం ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్య దంత వైద్యశాల అధినేత డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం' నిర్వహిస్తారని, మహిళలు మరియు బాలికలపై జరుగుతున్న శారీరక, మానసిక, మరియు గృహ హింసను అరికట్టడం, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశం అని, 1960 నవంబర్ 25న డొమినికన్ రిపబ్లిక్ నియంత రఫేల్ ట్రుజిల్లో పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్యాట్రియా, మినర్వా, మరియా తెరెసా అనే ముగ్గురు మిరాబల్ సోదరీమణులను అత్యంత దారుణంగా హత్య చేశారని, వీరి త్యాగానికి గుర్తుగా 1981 నుండి మహిళా హక్కుల కార్యకర్తలు నవంబర్ 25న హింసకు వ్యతిరేకంగా దినోత్సవాన్ని జరపడం ప్రారంభించారని, మన సమాజంలో మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని, హింసకు గురైన మహిళలకు న్యాయపరమైన, వైద్యపరమైన మరియు మానసిక సహాయం అందించాలని, నవంబర్ 25న ప్రారంభమయ్యే ఈ ప్రచారం, డిసెంబర్ 10న జరిగే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం వరకు 16 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఇంట్లో మౌనం, బయట భయం ఈ రెండింటి నుంచీ స్త్రీకి విముక్తి కావాలని, మహిళల పై చెయ్యి ఎత్తడం బలం కాదని, అది మగవారి బలహీనతకు నిదర్శనమని, స్త్రీ అంటే సృష్టికి మూలమని, ఆమెను రక్షించుకోవడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, వర్మ, డా సబిత, జ్యోతి, జయ లక్ష్మి, ప్రవంతి, లక్ష్మి తదితర మహిళలు పాల్గొన్నారు.

సర్పంచ్ గా ఒక్కసారి అవకాశం ఇస్తే ప్రత్తిపాడు గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తా.



-ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్ అభ్యర్థిని మదినే కనకలక్ష్మీ దొరబాబు.

కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్, 25: సర్పంచ్ గా ఒక్క అవకాశం ఇస్తే ప్రత్తిపాడు గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్ అభ్యర్థిని మదినే కనకలక్ష్మీ దొరబాబు అన్నారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో కూటమి సర్పంచ్ అభ్యర్థి మదినే కనకలక్ష్మిదొరబాబు ప్రచారంలో దూసుకుపోతుంది. 12, 13 వార్డుల్లో ఆమె వెంట ప్రచారంలో రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు పాల్గొని ప్రచారం నిర్వహించారు.భారీ స్థాయిలో మహిళలు, కార్యకర్తలు, అభిమానులు ఆమె వెంట తరలివచ్చారు.ఈ సందర్భంగా మదినే కనకలక్ష్మి దొరబాబు మాట్లాడుతూ ప్రతి వార్డుకు పక్కా సిమెంట్ రోడ్లు, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు, ప్రతి వీధికి వీధి లైట్లు, పక్కా డ్రైనేజీ వ్యవస్థ, ప్రతి రోజూ చెత్త సేకరణతో శుభ్రమైన ప్రత్తిపాడు, పచ్చదనంతో అందమైన గ్రామం, పేదలకు పింఛన్లు, ఇళ్ల పట్టాలు, యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ, మహిళలకు భద్రత, రక్షణ, పిల్లలకు మంచి చదువు, ఆట స్థలం, పెద్దలకు గౌరవం, ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. సమస్య వస్తే సర్పంచ్ కార్యాలయానికే రావాల్సిన పని లేదు, నేనే మీ ఇంటికి వస్తానని, మీ ఇంటి బిడ్డలా పని చేస్తానని చెప్పారు. కులం, మతం, పార్టీ చూడకుండా అందరికీ సమాన అభివృద్ధి చేస్తానని, ప్రత్తిపాడును జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో పలువురు కూటమి నాయకులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి ఏసుదాసు కుటుంబానికి ముద్రగడ గిరిబాబు పరామర్శ.



కిర్లంపూడి, పెన్ పవర్, నవంబర్, 25: జిల్లా కేంద్రమైన కాకినాడలో కాపు జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు కుటుంబాన్ని బుధవారం ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు.ఇటీవల వాసిరెడ్డి ఏసుదాసు పెద్ద కోడలు ప్రసవ సమయంలో కోడలితోపాటు నవజాత శిశువు ఇద్దరూ మృతి చెందారు. విషయము తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు కాకినాడలోని వాసిరెడ్డి ఏసుదాసు నివాసానికి వెళ్లి విషాదకర ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఏసుదాసుతోపాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో దేవుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తూ, మృతి చెందిన తల్లీబిడ్డల ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.

గెద్దనాపల్లి టిడిపి సర్పంచ్ అభ్యర్థిగా సూరిశెట్టి వెంకట శివ.

- అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వెంకట-శివ ప్రజలకు విజ్ఞప్తి.



కిర్లంపూడి,పెన్ పవర్,నవంబర్, 25 :కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సూరిశెట్టి వెంకట శివను జగ్గంపేట ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రకటించారు.
కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ బలపరిచిన సూరిశెట్టి వెంకట శివకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పూర్తి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా సూరిశెట్టి వెంకటశివ మాట్లాడుతూ ఉంగరం గుర్తుపై తమ అమూల్యమైన, పవిత్రమైన ఓటు ముద్రను వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని గ్రామంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తూ, అన్ని రంగాల్లో గెద్దనాపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

ధర్మవరం గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంమే మా లక్ష్యం.

- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మురళీకృష్ణంరాజు సోదరుడు సర్పంచ్ అభ్యర్థి ముదునూరి సీతారామరాజు.



కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, నవంబర్, 25: ధర్మవరం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సోదరుడు, ధర్మవరం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ముదునూరి సీతారామరాజు అన్నారు ధర్మవరం గ్రామపంచాయతీ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచుతూ, అభివృద్ధి పథంలో మహోన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని వైసీపీ సర్పంచ్ అభ్యర్థి ముదునూరి సీతారామరాజు, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు స్పష్టం చేశారు. బుధవారం ధర్మవరం గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో అనుచరులు, పార్టీ శ్రేణులతో కలిసి వారు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతులు, నేతన్నలు, కార్మికులు, వివిధ వృత్తుల వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ముదునూరి సోదరులు మాట్లాడుతూ ధర్మవరం గ్రామానికి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు, విశిష్టత ఉందని, ఆ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేలా గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో గ్రామానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకొస్తామని తెలిపారు. ఈ ప్రచారంలో స్థానిక పెద్దలు జువ్వల చినబాబు, బొల్లు సీతారామరాజు, ఎంపీటీసీ గొనగాల గోపి, కిల్లాడి బాబ్జి, యాళ్ల ఏసుబాబు, ఊబ కృపావరం, నానిపల్లి చంటి, కోన బాబ్జి, గొనగాల రామకృష్ణ, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి క్షేత్రస్థాయి పరిశీలన



సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై సమీక్ష..
నిబంధనలు పాటించాలని అధికారుల సూచన

ఆత్రేయపురం, పెన్ పవర్ నవంబర్ 25 ఆత్రేయపురం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు ఎన్నికల ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తపేట డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీ కె. సురేష్ కుమార్ ఆత్రేయపురం మండలంలో పర్యటించి ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అంశాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఎన్నికల విధుల్లో ఎటువంటి అలసత్వం, నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.అనంతరం ఆత్రేయపురం వెలుగు కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల వ్యయ నిర్వహణపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు, తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎన్.వి.వి. సత్యనారాయణ పాల్గొని అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు నిర్వహించే ప్రచార కార్యక్రమాలు, సమావేశాలు, ఇతర ఎన్నికల సంబంధిత కార్యకలాపాలకు చేసే వ్యయాలను నిబంధనల మేరకు నమోదు చేయాల్సిన ఆవశ్యకతను అధికారులు వివరించారు. ఎన్నికల ఖర్చుల విషయంలో నిర్దేశించిన వ్యయ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి రూపాయి ఖర్చుకు సంబంధించిన వివరాలను నిర్ణీత రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రచారానికి సంబంధించి చేసే ఖర్చులకు సంబంధించిన బిల్లులు, రసీదులు, ఇతర ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు.ఎన్నికల వ్యయ వివరాలను దాచిపెట్టడం, నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం వంటి చర్యలకు తావులేకుండా అభ్యర్థులు పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు హితవు పలికారు. ఎన్నికల వ్యయ పరిశీలనలో పారదర్శకత పాటించడం ప్రతి అభ్యర్థి బాధ్యత అని పేర్కొన్నారు. నిర్ణీత గడువుల్లో ఖర్చుల వివరాలను సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశానికి మండలంలోని పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనల అమలుతో పాటు ఎన్నికల వ్యయ నియంత్రణ కూడా కీలకమని, అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళిని గౌరవిస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పాల్గొనాలని అధికారులు సూచించారు.

గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం జోరు



ఓటర్లను కలుస్తూ తమ గుర్తులకు ఓటు వేయాలని అభ్యర్థన

గండేపల్లి, పెన్ పవర్: నవంబర్ 25:మండలంలోని గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలుస్తున్నారు. తమకు కేటాయించిన ఎన్నికల గుర్తులను ఓటర్లకు పరిచయం చేస్తూ, తమ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.
ఉప్పలపాడు గ్రామంలో సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారంలో సత్తి సోమరాజు ఒక అభ్యర్థి, రెండవ అభ్యర్థి మేడిబోయిన శ్రీనివాస్ ఓటర్లను కలిసి మద్దతు కోరుతున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా తమకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గ్రామాల్లో ఎన్నికల సందడి రోజురోజుకూ పెరుగుతోంది.

కత్తిపూడిలో కూటమి సర్పంచ్ అభ్యర్థి పద్మావతి శివకు పెరుగుతున్న ఆదరణ...



ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీలు మేడిశెట్టి బాబీ, కంచిబోయిన శ్రీను హారతులతో మహిళల స్వాగతం....
ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆశీస్సులతో ఎన్నికల బరిలో....

శంఖవరం పెన్ పవర్ నవంబర్ 25:- కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో కూటమి సర్పంచ్ అభ్యర్థి వెన్నా పద్మావతి శివ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి దిగిన ఆమెకు గ్రామంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రచారానికి వచ్చిన అభ్యర్థులకు మహిళలు హారతులు పట్టి ఆత్మీయ స్వాగతం పలుకుతుండటంతో గ్రామంలో ఎన్నికల సందడి నెలకొంది. ఆరో వార్డు జనసేన అభ్యర్థి గాబు సుభాష్, ఏడో వార్డు అభ్యర్థి తోట రమణమ్మ నాగేశ్వరరావు, ఎనిమిదో వార్డు అభ్యర్థి నక్కా రవితో కలిసి వెన్నా పద్మావతి శివ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ తమకు మద్దతుగా నిలిచి గెలిపించాలని అభ్యర్థించారు. గతంలో వెన్నా శివ చేపట్టిన సేవా కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ అందించిన సహకారాన్ని వివరిస్తూ అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని భరోసా ఇస్తూ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. మహిళలు హారతులతో స్వాగతం పలుకుతుండటం, స్థానికుల నుంచి లభిస్తున్న స్పందనతో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. ఈ ప్రచార కార్యక్రమంలో శంఖవరం మండలం ఎంపీపీ మేడిశెట్టి బాబీ, జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను, ఎంపీటీసీలు ఆలపు సత్యనారాయణ, కొయ్యా భవానీ రమణ, గాబు పావని శివ, గ్రామ టీడీపీ అధ్యక్షులు కేళంగి జన, మాజీ ఎంపీటీసీ సాధనాల లక్ష్మిబాబు, దేశీలంక వెంకటరమణ, గౌతు కన్నారావు, రౌతు శివ, జ్యోతుల శివ, నక్కా శ్రీను, అమజాల రామకృష్ణ, గ్రంధి చక్రి, కోలా వెంకట్, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



రూ.28 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 25:

కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 25:పరిసర ప్రాంతాల్లో ఇళ్ల తాళాలు పగలగొట్టి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు దాసరి హరీష్ (25)ను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి నాలుగు దొంగతనం కేసులకు సంబంధించి రూ.28 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులతో పాటు రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, వెల్లడించారు.కాకినాడకు చెందిన హరీష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బాలానగర్‌లో నివాసం ఉంటున్నాడు. కాకినాడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెహర్ నగర్, రాజ్యలక్ష్మి నగర్, శాంతి నగర్‌తో పాటు సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని మోహన్ కాన్వెంట్ వీధి, కాకినాడ మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంబమూర్తి నగర్ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనలకు సంబంధించి నాలుగు కేసులు నమోదయ్యాయి.నిందితుడిపై గతంలోనే 26 దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. కాకినాడ పోర్టు పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఇప్పటికే సస్పెక్ట్ షీట్ కూడా ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు పర్యవేక్షణలో, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. త్రినాథ్ సహకారంతో కాకినాడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. అప్పలనాయుడు, సిబ్బంది నిందితుడిని నవంబర్ 24న అరెస్టు చేశారు.వరుస దొంగతనాల కేసులను ఛేదించి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు రూ.28 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న రెండో పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం. అప్పల నాయుడు, పోలీసు సిబ్బంది, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. త్రినాథ్, ఆయన సిబ్బందిని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ప్రత్యేకంగా అభినందించారు.

కోలంకలో బూరెల పెద్దకాపు విస్తృత ప్రచారం



అభివృద్ధే అజెండా, ప్రజాసేవే లక్ష్యం

కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 25:కాజులూరు మండల పరిధిలోని కోలంక గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి బూరెల పెద్దకాపు (మంచం గుర్తు) ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. బుధవారం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి, తన మంచం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, ఆసుపత్రి వంటి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తనను సర్పంచ్‌గా పోటీ చేయాలని కోరడంతో ఎన్నికల బరిలో నిలిచానని తెలిపారు. ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే గ్రామంలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, కోలంకను అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు.గత ఏడేళ్లుగా గ్రామంలో సప్తాహాలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పార్టీల నుంచి తనకు సంపూర్ణ మద్దతు ఉందని పేర్కొంటూ గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో పలువురు గ్రామస్థులు ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ నెల 29న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మంచం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని బూరెల పెద్దకాపు ఓటర్లను కోరారు.

పంట వేసిన ప్రతి సెంటు భూమికి ఎరువు అందించడమే లక్ష్యం



కుక్కునూరు, నవంబర్ 25 పెన్ పవర్ :కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో రైతులు సాగు చేస్తున్న ప్రతి సెంటు భూమికి అవసరమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవడమే వ్యవసాయ శాఖ ప్రధాన లక్ష్యమని కుక్కునూరు మండల వ్యవసాయ అధికారి రెంటపల్లి బాలాజీ తెలిపారు.కుక్కునూరు మరియు వేలేరుపాడు మండలాల్లో వెబ్ ల్యాండ్ సేవలు సుమారు 2018 సంవత్సరం నుండి అందుబాటులో లేకపోవడం వలన అనేక మంది రైతులకు సంబంధించిన భూమి వివరాలు ప్రస్తుతం వెబ్లాండ్ లో ప్రతిబింబించడం లేదు. దీంతో అటువంటి రైతుల భూమి, సాగు వివరాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (ఖీఖీూ) యాప్ లో కూడా స్వయంచాలకంగా అందుబాటులోకి రాకపోవడంతో, ఎరువుల పంపిణీ సమయంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యను క్షేత్రస్థాయిలో గుర్తించిన వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే వ్యవసాయ శాఖ కమిషనరేట్, ఆంధ్రప్రదేశ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిజంగా పంట సాగు చేస్తున్న రైతులకు కేవలం వెబ్లాండ్ భూమి వివరాలు అందుబాటులో లేవనే కారణంతో ఎరువులు అందకుండా ఉండకూడదనే అంశాన్ని తెలియజేశారు.రైతు సాగు చేస్తున్న భూమి రికార్డు వెబ్ ల్యాండ్ లో ఉందా లేదా అనేది కాకుండా, వాస్తవంగా పంట సాగులో ఉందా అనేదే ప్రధాన అంశం అనే ఉద్దేశంతో, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ విధానాల ద్వారా అర్హత కలిగిన రైతులకు ఎరువులు అందించే చర్యలు చేపడుతున్నారు.వెబ్ ల్యాండ్ లో భూమి రికార్డులు అందుబాటులో లేని భూములకు సంబంధించి రైతుల భూమి వివరాలు, సాగు విస్తీర్ణం, సాగు చేస్తున్న పంట తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధృవీకరించి, సంబంధిత వివరాలను ఖీఖీూ యాప్ లో నమోదు చేసే ప్రక్రియను చేపడుతున్నారు. అనంతరం నిబంధనల ప్రకారం అర్హత కలిగిన రైతులకు అవసరమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.రైతు వాస్తవంగా ఎంత విస్తీర్ణంలో ఏ పంట సాగు చేస్తున్నాడు అనే అంశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాగులో ఉన్న పంటకు అవసరమైన ఎరువులు అర్హత మేరకు అందేలా వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.భూమి రికార్డు ఏ విధంగా ఉన్నా, పంట సాగులో ఉన్న ప్రతి సెంటు భూమికి అవసరమైన ఎరువు అందించడమే మా లక్ష్యం. నిజమైన సాగుదారుడికి ఎరువు అందకుండా పోకుండా, అదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ జరగకుండా పారదర్శకంగా వ్యవస్థను అమలు చేస్తున్నాం అని మండల వ్యవసాయ అధికారి రెంటపల్లి బాలాజీ తెలిపారు.రైతులు తమ భూమి మరియు సాగు వివరాలు, ఆధార్ కార్డు నకలు, పట్టాదారు పాస్బుక్ నకలు సంబంధిత రైతు సేవా కేంద్రం (ూాఖ) సిబ్బందికి అందించి, అవసరమైన క్షేత్రస్థాయి పరిశీలన మరియు ధృవీకరణకు సహకరించాలని ఆయన కోరారు. ఇదే విధంగా గత ఖరీఫ్ సీజన్ లో ూ్రూాxమీ యాప్ లో కూడా చేసి ఉన్నామని తెలిపారు. రైతుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, నిజంగా పంట సాగు చేస్తున్న అర్హత కలిగిన ప్రతి రైతుకు నిబంధనల మేరకు అవసరమైన ఎరువులు అందించడమే వ్యవసాయ శాఖ లక్ష్యమని మండల వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు. కుక్కునూరు మండలం, చీరవల్లి గ్రామంలో రైతులకు ఖీఖీూ యాప్ పనితీరు, రైతుల రిజిస్ట్రేషన్ మరియు ఎరువుల బుకింగ్ విధానంపై అవగాహన కల్పించారు. రైతులతో స్వయంగా ఎరువులు బుక్ చేయించి, అర్హత మేరకు ఎరువులను మండల వ్యవసాయ అధికారి సరఫరా చేశారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి పంపిణీ



అదనపు ఎన్నికల అధికారి, కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 25:నగరపాలక మేయర్ వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో ఎస్ కే వి టి కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం అదనపు ఎన్నికల అధికారి కమిషనర్ రాహుల్ మీనా పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను, సామాగ్రి అందజేత ప్రక్రియను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 72 వార్డులకు గానూ 494 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి పంపిణీ చేపట్టగా కావలసిన బ్యాలెట్ పత్రాలు తదితర సామాగ్రిని అందించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, నగరపాలక ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు) తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులకు రాండమైజేషన్ నిర్వహించి, అనంతరం కేటాయించిన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లను పంపిణీ కేంద్రానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన బ్యాలెట్ పేపర్ల సంఖ్య, బ్యాలెట్ బాక్సుల పనితీరు, ఎన్నికల సామాగ్రి అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సంబంధిత సిబ్బందితో కలిసి పోలీసు బందోబస్తు మధ్య బస్సుల ద్వారా తమకు కేటాయిం చిన పోలింగ్ కేంద్రాలకు బయలుదేరినట్లు వెల్లడిం చారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇతర పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, రూట్ ఆఫీసర్లను నియమిం చినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామాగ్రి చేరుకునేలా సమయపాలనతో చర్యలు చేపట్టినట్లు వివరించారు.

నగరపాలక ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. 72 వార్డు సభ్యుల స్థానాలకు గాను రెండు స్థానాలు ఏకగ్రీవం అయినట్లు పేర్కొన్నారు. నగర పరిధిలో 494 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 4,63,322 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 2,23,637 మంది కాగా 2,39,615 మంది స్త్రీలు, ఇతరులు 70 మంది ఉన్నట్లు వెల్లడించారు. అలాగే 28 (25 +3 రిజర్వ్) మంది రిటర్నింగ్ అధికారులు ., 31 (25 + 6 రిజర్వ్) మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు., 593 మంది పీఓలు (494 మంది + 99 రిజర్వ్)., 593 మంది ఏపీఓలు (494 మంది + 99 మంది రిజర్వ్)., 2,371 మంది ఓపీఓలు (1,976 + 395 రిజర్వ్)., 26 మంది (24 + 2 రిజర్వ్) జోనల్ అధికారులు., 24 మంది రూట్ ఆఫీసర్లలను నియమించినట్లు తెలిపారు. అలాగే 61 ప్రాంతాలలోని 199 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 65 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు వెల్లడించారు. పోలీసు సిబ్బందితో కలిపి సుమారు 10 వేల మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్నారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో కెమెరాల పర్యవేక్షణతో పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ బాక్సులను అత్యంత భద్రత నడుమ ూాఖఐ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తిరిగి తీసుకువచ్చి.. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి దశలోనూ పకడ్బందీ ఏర్పాట్లతో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు నగరపాలక సంస్థ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలియజేశారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ క్షితిజ్ ఆదిత్య శర్మ, అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఇతర అధికారులు ఉన్నారు.

ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ మృతి

వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 25: వై రామవరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ గా పనిచేస్తున్న కే. కొండబాబు మంగళవారం రాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంతకాలంగా మండల విద్యాశాఖలో కోఆర్డినేటర్ గా పనిచేస్తున్నారని తెలిపారు. కొండబాబు అకాల మృతి కలచి వేసిందని ఎంఈఓ 1 శ్రీనివాసరావు, ఎంఈఓ 2 జోగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు, అన్నారు. కొండబాబు మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.



వైద్య విద్య విద్యార్థుల్లో మానసిక సమస్యల పై అవగాహన



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 25:వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ఆందోళన, భావోద్వేగ సమస్యలు, చదువు ఒత్తిడి, అలసట వంటి సమస్యలను ముందుగానే గుర్తించి, వారికి తగిన మానసిక సహాయాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ వైద్య కళాశాల, అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ వైద్య విద్య పుస్తక పరిజ్ఞానం, పరీక్షల్లో ప్రతిభకు పరిమితం కాదని, విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యం ముఖ్యమన్నారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సకాలంలో తగిన సహాయం అందించే వ్యవస్థ కళాశాలలో ఉండాలని తెలిపారు.ఈ ఏ ఎస్ ఈ ఆంధ్రప్రదేశ్ బృందం ప్రాజెక్ట్ మేనేజర్ డా. తేజావతి సైకాలజిస్ట్ డా. గిరీష్ జైన్ మాట్లాడుతూ వైద్య విద్యలో విద్యార్థులు సాధారణ మానసిక ఆరోగ్య సవాళ్లు, పరీక్షల ఒత్తిడి, ఆందోళన , భావోద్వేగ అస్థిరత, మానసిక అలసట , భావోద్వేగ కుంగుబాటు వంటి సమస్యల పై శిక్షణ ఇచ్చారు. పీర్ గ్రూప్, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు విద్యార్థులకు తొలి స్థాయి సహాయక వ్యవస్థగా పనిచేయాలని, సైకియాట్రిస్ట్, సైకాలజిస్ట్ వంటి అర్హత కలిగిన మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం పొందాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమానికి కళాశాల తరఫున సమన్వయకర్తగా వ్యవహరించిన సైకియాట్రీ విభాగాధిపతి డా. అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పీర్ మెంటార్లు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా వెల్లడించగలిగే స్నేహపూర్వక విద్యా వాతావరణాన్ని కల్పించడం అత్యంత ముఖ్యమని తెలిపారు.

డా. రామారెడ్డి మాట్లాడుతూ పీర్ మెంటార్లు తమ తోటి విద్యార్థుల్లో వచ్చే ప్రవర్తనా మార్పులను గమనించి, అవసరమైన సమయంలో వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ శిక్షణ సహచరులకు మద్దతు అందించే విధానాలు, వృత్తిపరమైన మానసిక ఆరోగ్య సహాయం ఎప్పుడు, ఎలా పొందాలి అనే అంశాలపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో డా. చాందిని డా. సీతారామరాజు డా. వి.వి. దుర్గాప్రసాద్ డా. శ్రీదేవి అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమళ్లలో సలాది వెంకటరమణ దూకుడు



- కత్తెర గుర్తుతో హోరెత్తిన ప్రచారం
- గ్రామ అభివృద్ధే లక్ష్యం..
- తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి హామీ

కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 25:కాజులూరు మండల పరిధిలోని పెనుమళ్ల గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సలాది వెంకటరమణ (కత్తెర గుర్తు ??) గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల గుర్తులు కేటాయింపు అనంతరం తన మద్దతుదారులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించి, కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా సలాది వెంకటరమణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ముఖ్యంగా గ్రామంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌గా తనకు ఒక్క అవకాశం కల్పిస్తే గ్రామంలో ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరుస్తానని పేర్కొన్నారు.కూటమి పెద్దలు, నాయకులతో చర్చించి ప్రభుత్వ సహకారంతో గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు చేపడతానని, ప్రజల సమస్యలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని స్పష్టం చేశారు. తనకు మద్దతు పలుకుతున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ నెల 29న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కత్తెర గుర్తుపై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ప్రచారంలో సలాది వెంకటరమణతో పాటు సలాది రామకృష్ణ, టీడీపీ నాయకుడు వనుం వీరబ్రహ్మం, పలువురు కూటమి నాయకులు, మద్దతుదారులు పాల్గొన్నారు. వెంకటరమణ తన విజయంపై ధీమా వ్యక్తం చేస్తూ గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

గోదావరిలో పడి యువకుడు గల్లంతు

ఇసుక గోతులు ప్రాణాలు తీస్తున్నా.. పట్టించుకునే వారేరి?



సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 25:గోదావరి నదిలో పడి ఓ యువకుడు గల్లంతైన ఘటన సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కాటవరం గ్రామానికి చెందిన రాజేష్ (20) మునికూడలి గ్రామానికి చెందిన రైతు గవల్ల వెంకన్న వద్ద పనిచేస్తూ గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు.రోజువారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం గేదెలను తోలుకొని మునికూడలి గోదావరి ఇసుక ర్యాంపు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో గోదావరిలో దిగిన రాజేష్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు.ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు, తోటి పశువుల కాపరులు వెంటనే గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడి ఆచూకీ కోసం నదిలో వెతుకుతున్నారు. రాజేష్ గల్లంతుతో కాటవరం, మునికూడలి గ్రామాల్లో ఆందోళన నెలకొంది. కాగా రాజేష్ మునిగిపోయిన గోదావరి నది వద్ద గత కొంతకాలంగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయటం, పెద్ద పెద్ద గోతులు పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అక్రమంగా ఇసుకను నదిలో తోడుస్తూ కొండలను తలపించేలా ఇసుక గుట్టలు పెట్టి అక్ర మార్జన చేస్తున్న సిండికేట్లకు ఈ ప్రాంతం ప్రజా ప్రతినిధులు పూర్తి సహకారం అందించడంతో గోదావరి లంకల్లో పలువురు కూలీలు ప్రాణాలు పోతున్నాపట్టించుకున్న నాధుడే లేడు అంటున్నారు.

అసౌకర్యాలతో పోలింగ్ సిబ్బంది ఇబ్బందులు

అన్నం సాంబార్ తోనే భోజనం



వై రామవరం/ అడ్డతీగల, పెన్ పవర్, నవంబర్ 25: అడ్డతీగల మండల కేంద్రంలో రెండవ సాధారణ ఎన్నికలు అయిన పంచాయతీ ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నామని, భోజనం లో అన్నం సాంబారు తో తినవలసి వచ్చిందని సిబ్బంది ఆరోపించారు.రెండవ సాధారణ ఎన్నికలలో భాగంగా పంచాయతీ ఎన్నికలు నిర్వహణ కోసం మెటీరియల్ పంపిణీ అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ లో ఏర్పాటు చేశారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల మెటీరియల్ ఇవ్వడానికే మధ్యాహ్నం ఒంటిగంట అయిందని, తగిన సౌకర్యాలు లేకపోవడంతో గ్రౌండ్ లో కూర్చొని మెటీరియల్ సరిచూసుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం ఎన్నికల సిబ్బంది కోసం ఏర్పాటుచేసిన భోజనాలలో కొందరికి సరిపడా వడ్డించారని, చాలామంది సిబ్బందికి అన్నం సాంబార్ మాత్రమే పెట్టారని ఎన్నికల సిబ్బంది ఆరోపించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన తమకు అధికారులు భోజనాల సరఫరాలలో తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు.

జిల్లా ప్రధాన న్యాయ స్థానం 222వ వార్షికోత్సవ వేడుకలు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వై శ్రీలక్ష్మి



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్25:చారిత్రక నగరమైన రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రధాన న్యాయస్థానం ఏర్పడి 222 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 28న నిర్వహించనున్న వార్షికోత్సవ వేడుకలను రాష్ట్ర ఉత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ వేడుకలతో పాటు 26న నిర్వహించే న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, దివ్యాంగుల విద్యాసంస్థల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలతో పాటు పలు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా భవిత, జియాన్ పాఠశాలలు, జి.ఎస్.కె.ఎం. లా కళాశాల, కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాల నేరస్తుల సంరక్షణ కేంద్రం తదితర సంస్థల్లో విద్యార్థులకు రన్నింగ్, క్యారమ్స్, లాంగ్ జంప్, బాస్కెట్‌బాల్, వ్యాసరచన, లా క్విజ్, డిబేట్, మ్యూజికల్ చైర్ వంటి వివిధ పోటీలు నిర్వహించారు. జియాన్, భవిత దివ్యాంగుల పాఠశాలల్లో పోటీలు నిర్వహించి దివ్యాంగ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, ఐకమత్య భావనను పెంపొందించ డంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించారు. ఈ పోటీల్లో సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జి. షణ్ముఖరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు, పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com